ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 27.0

జిల్లాలో 77,485 బంగారు కుటుంబాలు లక్ష్యం

ఏలూరుసిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 77,485 బంగారు కుటుంబాలను లక్ష్యంగా పెట్టుకున్నట్టు కలెక్టర్ వెట్రి సెల్వి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం పీ4పై జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏలూరు నుంచి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, సీపీవో వాసుదేవరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులతో అనుసంధానం చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాకు నిర్దేశించిన బంగారు కుటుంబాల లక్ష్యాలను సాధిం చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

వృద్ధిరేటు లక్ష్యాల సాధనకు ప్రణాళిక

ఏలూరు సిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి):జిల్లాలో వృద్ధిరేటు లక్ష్యాల సాధన దిశగా నియోజకవర్గాల అభివృద్ధిపై నిబంధనలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులు, నియోజకవర్గాల అభివృద్ధి విజన్ ప్లాన్ రూపొందించే సిబ్బందితో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా, నియోజకవర్గాల విజన్ డాక్యుమెంట్లు రూపొందించామన్నారు. పేదరిక నిర్మూలన, యువతకు ఉద్యోగ అవకాశాలతో పాటు 15 శాతం వృద్ధిరేటు సాధించే దిశగా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సీపీవో వాసుదేవరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, సమగ్రశిక్ష పీడీ పంకజ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో గత 24 గంటల్లో పెదవేగి మండలంలో అత్యధికంగా 21.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 4 మి.మీగా నమోదైంది. చింతలపూడి 14.2, బుట్టాయగూడెం 13.6, పోలవరం 8.2, కామవరపుకోట 7.6, ముసునూరు 6.4, భీమడోలు 4.6, వేలేరుపాడు, లింగపాలెంలలో 3.6, ద్వారకాతిరుమల 3.4, దెందులూరు 3.2, కొయ్యలగూడెం, ఆగిరిపల్లిలలో 2.6, నిడమర్రు 2.4, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, చాట్రాయిలలో 2.2, కుక్కునూరు 2 మి.మీ వర్షపాతం నమోదైంది.



పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ

ఏలూరు క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి):సిబ్బంది సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. జిల్లాలో పనిచేస్తున్న సివిల్, ఏఆర్ పోలీస్ సిబ్బంది, హోంగార్డు విభాగాలకు చెందిన హోం గార్డుల సమస్యలపై శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వినతులను స్వీకరించారు. ఆ సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అల్లూరి ఒక మహోన్నత శక్తి : కలెక్టర్

ఏలూరు రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి):కలెక్టరేట్‌లో శుక్రవారం అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవితాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ఉద్యోగులు ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం అలుపెరగని కృషి చేసిన అల్లూరి స్ఫూర్తిదాయకమన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎస్ఎస్ కృపావరం, కలెక్టరేట్ పరిపాలన అధికారి నాంచారయ్య, కలెక్టరేట్ వివిధ విభాగాలలో సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



నాగిరెడ్డిగూడెంలో కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న ఎక్సైజ్, పోలీస్ అధికారులు

మూడు గ్రామాల్లో కార్డన్ సెర్చ్

చింతలపూడి, జూలై 4(ఆంధ్రజ్యోతి):జిల్లా ఎస్పీ ఆదేశాలతో సారా తయారీ, అమ్మకాలు జరిగే నాగిరెడ్డిగూడెం, తలార్లపల్లి, ప్రగడవరం గ్రామాల్లో శుక్రవారం ఉదయం పోలీస్, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ జరిపారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి క్షుణ్ణంగా తనిఖీలు జరిపారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. సారా తయారీ చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎక్సైజ్ అధికారులు పాండురంగారావు, సీఐలు ధనరాజ్, బి.సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ సతీష్‌కుమార్, జిల్లాలోని అన్ని స్టేషన్ల నుంచి సీఐలు, ఎస్ఐలు వందమంది సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు.



వేల్పుచర్లలో ఇళ్ల స్థలాలకు భూమిని పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు : మంత్రి

ముసునూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి):అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాన్ని ఇచ్చి సొంతింటి కలను నెరవేర్చుతామని గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. వేల్పుచర్లలో ఆరు ఎకరాల కొండ పోరంబోకు భూమిని ఆయన అధికారులు, నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. భూమిని సర్వే చేసి, చదును చేసి ఇళ్ల స్థలాల కేటాయింపునకు సిద్ధం చేయా లని అధికారులను ఆదేశించారు. ఎంతమందికి ఇళ్ల స్థలాలు ఇవ్వొచ్చని తహసీల్దార్ రమణను ప్రశ్నించగా సుమారు 60 మందికి ఇవ్వొచ్చన్నారు. త్వరితగతిన సర్వే, లెవెలింగ్ పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచిం చారు. త్వరలోనే ఇళ్ల స్థలాలను అర్హులకు అందజేస్తామన్నారు. ఎంపీడీవో సత్యనారాయణ, వీఆర్వోలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సొంత గూడు.. కరువాయె!



ముదినేపల్లిలో అవసానదశలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్ల శాఖకు భవనాల కొరత

భూముల క్రయ, విక్రయాలతో నిత్యం కళకళలాడే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు దశాబ్దాల తరబడి కనీస సౌకర్యాలకు దూరంగా ఉంటున్నాయి. ఏటా రూ.350 కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వానికి ఆర్జించి పెడుతున్న ఈ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వంలోనైనా వీటి నిర్మాణాలపై దృష్టి పెట్టాలని కక్షిదారులు కోరుతున్నారు.

- అద్దె భవనాల్లోనే ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- ఇరుకు గదులు.. వసతుల లేమి
- కక్షిదారులకు నిత్యం సమస్యలే స్వాగతం
- సొంత భవనాలకు ప్రతిపాదనలతో సరి..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఆదాయాన్ని అందించే ప్రధానశాఖల్లో స్టాంపులు,రిజిస్ట్రేషన్ల శాఖ ప్రధానమైంది. ఎంత ఆదాయం ఆర్జించి ఏ లాభం? కార్యాలయానికి సొంత భవనాల్ని సమకూర్చుకోలేని స్థితిలో ఈ శాఖ ఉంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ పరిధిలోని సబ్- రిజిస్ట్రార్ కార్యాలయాలు 80 శాతం వరకు అన్ని ఇంకా అద్దె భవనాల నుంచే పాలన సాగిస్తున్నాయి. దీంతో నెలవారీ అద్దె చెల్లించడం భారంగా మారుతోంది. 'మా కార్యాలయాలకు సొంత భవనాలు కట్టండి' అని మొత్తుకుంటున్నా ఫలితం లేకుండా పోతోందని రిజిస్ట్రార్లు వాపోతున్నారు.

ఎనిమిది చోట్ల అద్దె భవనాల్లోనే..

ఏలూరులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగుతున్నాయి. ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, పోలవరం,చింతలపూడి, కైకలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నాలుగు మాత్రమే ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగిలిన ఎనిమిది చోట్ల ఇరుకు భవనాల్లో అరకొర వసతుల నడుమ అధికారులు, సిబ్బంది సేవలను అందిస్తున్నారు. క్రయ విక్రయదారులు కూర్చునేందుకు కుర్చీలుండవు. మరుగుదొడ్లు అలంకార ప్రాయమే. ఏలూరు తర్వాత భీమడోలులో ఎక్కువగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఇక్కడ పోలీస్ స్టేషన్ సమీపంలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ఉండేది. 25 ఏళ్ల క్రితం క్రితం శిథిలం కావడంతో ప్రభుత్వ స్థలం నిరుపయోగంగా ఉంది. జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 66 ఏళ్ల నుంచి నడుస్తోంది. ఇరుకు గదులతో కక్షిదారుల సహనానికి పరీక్షలు తప్పడం లేదు. దాత వాసా చిన అయ్యన్న 20 సెంట్లు విరాళంగా సబ్ రిజిస్టర్ కార్యాలయానికి ఇచ్చారు. అధికారులు ఇక్కడ నిర్మాణానికి ప్రతిపాదనలు ఆమోదించుకోలేపోతున్నారు.గణపవరం, వట్లూరుల్లోని కార్యాలయాలు కొంత వరకు ఫరవా లేదు. కామవరపుకోటలో ఇరుకు గదుల నడుమ ఇరవై ఏళ్ల నుంచి అద్దె భవనంలోనే కార్యాలయం నడుస్తోంది. కక్షిదారులు రోడ్లపైనే గడపాల్సి వస్తోంది. తాలూకా వ్యవస్థ సమయంలోనే కైకలూరు నియోజక వర్గంలో మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. కైకలూరుకు **(మిగతా 8వ పేజీలో)**

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలో ఎనిమిది చోట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. ఇటీవల కొన్నింటిని వేరే భవనాల్లో మార్చాలని సూచించగా వసతులు ఉన్న అద్దె భవనాలు దొరడం లేదని సమాధానం వచ్చింది. కొత్తగా భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని. మా ఉన్నతాధికారులు కోరుతూనే ఉన్నాం. వీటి కి అనుమతులు రావాల్సి ఉంది. ప్రభుత్వం, రెవెన్యూశాఖలు గ్రీన్ సిగ్నల్స్ ఇవ్వాల్సి ఉంది.

- కె.శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స

బాబును నమ్మితే మోసం గ్యారంటీ

- మాజీ మంత్రులు బొత్స, కారుమూరి ఎద్దేవా

పెదవేగి, జూలై 4(ఆంధ్రజ్యోతి):'బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ అంటూ టీడీపీ నేతలు ఇంటింటికీ తిరుగుతున్నారు..భవిష్యత్ మాట దేవుడెరుగు.. బాబును నమ్మితే మోసం మాత్రం గ్యారంటీగా కనిపిస్తోంది' అంటూ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నివాసం దగ్గర శుక్రవారం వైసీపీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న బొత్స, కారుమూరి మాట్లాడుతూ సంపద సృష్టిస్తానని, ఏడాది తిరిగే సరికి రాష్ట్రాన్ని అభివృద్ధిలో నిలుపుతామని చంద్రబాబు ఎన్నికల్లో ఊకదంపుడు హామీలు ఇచ్చారన్నారు. ఇసుక, మట్టి, మద్యం మాఫియాలతో టీడీపీ నేతలు ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ తాను బాకీ ఉన్నానని కొల్లేరు ప్రజల ముసుగులో కొంత మంది తన ఇంటి దగ్గర ఆందోళన చేస్తున్నారని, కానీ తాను ఏ ఒక్కరికీ బాకీలేనన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు, జక్కంపూడి రాజా, నాయకులు నౌడు వెంకటరమణ, మామిడిపల్లి జయప్రకాశ్, కంభంపాటి విజయరాజు, సునీల్ పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధులే లక్ష్యంగా దొంగతనాలు

దొంగల ముఠాను పట్టుకున్న పోలీసులు -7లో..

బదిలీలు..అంతలోనే డిప్యుటేషన్లు!

మరో జిల్లాకు బదిలీ అయిన అధికారి పేరిట సర్దుబాట్లు.. పని స్థానాల్లో వైద్యసేవలకు విఘాతం

ఏలూరు అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): బదిలీ ఉత్తర్వులందుకున్న అధికారిపేరిట జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో నిబంధనలకు విరుద్ధంగా పలువురికి డెప్యుటేషన్లు, పనిస్థానాల సర్దుబాట్లు కొనసాగుతుండడం ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశమైంది.వైద్యఆరోగ్యశాఖలో ఉద్యోగులకు సాధారణ బదిలీ కౌన్సెలింగ్ కొద్దిరోజుల క్రితమే జరిగిన విషయం విదితమే. ఆ మేరకు సీనియార్టీ ప్రాతిపదికన ఆయా కేడర్ల ఉద్యోగులను బదిలీ చేశారు. కౌన్సెలింగ్ ముగిసి పదిరోజులు కాకుండానే వివిధ ప్రాంతాల్లో నూతన పనిస్థానాల్లో విధులు చేపట్టిన కొందరు ఉద్యోగులు జిల్లా కార్యాలయంలో పైరవీలు చేయడం, ఆ మేరకు నచ్చిన స్థానాలకు సర్దుబాటు చేస్తూ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసేయడం చాపకిందనీరులా జరిగిపోతున్నాయి. ఈ క్రమంలో దెందులూరు నియోజకవర్గంలోని గుడివాకలంక పీహెచ్‌సీకి కొద్దిరోజులక్రితమే బదిలీఅయిన మెడికల్ ఆఫీసర్‌కు డీఎంహెచ్‌వో కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తించేలా అనుమతించడం కార్యాలయ వర్గాల్లో కొద్దిరోజులుగా చర్చ నడుస్తోంది. వాస్తవానికి గుడివాకలంక పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులకుగాను ఒకరు ఇటీవల బదిలీపై నియమితులయ్యారు. మరొకరు బదిలీపై ఇక్కడి పీహెచ్‌సీలో చేరాల్సివున్నప్పటికీ ఏజెన్సీ మండలంలోని పీహెచ్‌సీకి నియమితులైన మెడికల్ ఆఫీసర్ ఇంతవరకు విధుల్లోకి చేరేందుకు రాకపోవడంతో గుడివాకలంకలో చేరేందుకు అవకాశంలేదు. ఈ నేపథ్యంలో గుడివాకలంక పీహెచ్‌సీకి ఇద్దరు రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్లు ఉన్నప్పటికీ ఒక్కరూ లేకుండానే, సమీపంలోని చాటపర్రు పీహెచ్‌సీ వైద్యాధికారికి ఇన్‌చార్జి బాధ్యతలిచ్చి నడిపిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు విధుల్లోలేని విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా అధికారుల వద్ద ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. డీఎంహెచ్‌వో కార్యాలయంలో బఫర్ డాక్టర్లు, వివిధ విభాగాల్లో సీనియర్లు ఉండగా, క్షేత్రస్థాయిలో వైద్యసేవలందించాల్సిన మెడికల్ ఆఫీసర్లను ఆఫీసుకు డిప్యుటేషన్లపై తీసుకురావడమేంటని ఉద్యోగవర్గాలే ప్రశ్నిస్తున్నాయి.

మరోవైపు ఇటీవలే బదిలీ అయిన జిల్లా అధికారికి నిబంధనల ప్రకారం డెప్యుటేషన్లు, సర్దుబాట్లు చేయడానికి వెసులుబాటు ఉండబోదని, అయినప్పటికీ కొందరు ఉద్యోగులకు ఆర్డర్లు ఇచ్చేస్తున్నారని తెలుస్తోంది. కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేసి కొద్దిరోజుల క్రితమే పెదపాడు పీహెచ్‌సీకి బదిలీ అయిన ఉద్యోగిని పదిరోజుల వ్యవధిలోనే తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేసేలా జారీచేసిన ఉత్తర్వులు, ప్రొబేషన్ డిక్లేర్ కాకుండానే ఏలూరు నుంచి ఒకరిని రాజమహేంద్రవరానికి, టి.నరసాపురం, గోకవరం పీహెచ్‌సీలకు బదిలీ అయిన ఇద్దరు ఏఎన్ఎంలను ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో విధులు నిర్వర్తించేలా ఆదేశాలు జారీ చేయడం నిబంధనలకు విరుద్ధమేనని చెబుతున్నారు. జిల్లా నుంచి బదిలీ అయిన అధికారి సంతకాలతో డిప్యుటేషన్ ఉత్తర్వులు జారీచేయడం, కీలకమైన గుడివాకలంక పీహెచ్‌సీకి నియమితులైన రెగ్యులర్ వైద్యాధికారి స్థానికంగా వైద్య సేవలందించకుండా డీఎంహెచ్‌వో కార్యాలయానికి రావడంపై కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు సమాచారం.

కాగా జిల్లాకు కొత్త డీఎంహెచ్‌వోగా డాక్టర్ పి.జాన్ అమృతం ఇటీవల నియమితులైన విషయం తెలిసిందే. గుంటూరు నగరపాలక సంస్థ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (సీఎంహెచ్‌వో)గా పనిచేస్తున్న ఆమెను జిల్లాలో డీఎంహెచ్‌వోగా బదిలీపై నియమించగా, ఆమె స్థానంలో ఇక్కడి డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినిని నియమించారు. సోమవారం డాక్టర్ జాన్ అమృతం జిల్లాలో బాధ్యతలు చేపడతారని తెలిసింది.

నరసాపురం నుంచి అరుణాచలం

- ప్రతి బుధవారం ప్రత్యేక రైలు
- రాష్ట్రం నుంచి నేరుగా వెళ్లే తొలి రైలు -7లో..

విభిన్నంగా ఆలోచించి విజయం సాధించాలి

- జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



స్నాతకోత్సవంలో విద్యార్థినికి బంగారు పతకం, పట్టా అందజేస్తున్న గవర్నర్ నజీర్

జేఎన్టీయూకే(కాకినాడ), జూలై 4(ఆంధ్రజ్యోతి):యువత ధైర్యంగా, విభిన్నంగా ఆలోచిస్తూ సమస్యలను ఎదుర్కొని విజయం సాధించాలని రాష్ట్ర గవర్నర్, జేఎన్‌టీయూకే కులపతి ఎస్.అబ్దుల్‌నజీర్ పిలుపునిచ్చారు. కాకినాడ జేఎన్టీయూలో శుక్రవారం జరిగిన 11వ స్నాతకోత్సవంలో గవర్నర్ అధ్యక్షోపన్యాసం చేస్తూ విద్య అనేది ప్రతి ఒక్కరికీ అవసరమైందని, విద్యతో ప్రపంచంలో దేన్నైనా సాధించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏర్పాటవుతున్న క్వాంటమ్ మిషన్ వల్ల 2026 నాటికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ, ఏఐ, ఐవోటీ, రోబోటిక్స్ నానోటెక్నాలజీ, తాత్విక ఆలోచనలతో సాంకేతికతను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. స్వర్ణాంధ్రప్రదేశ్-2027 విజన్ ద్వారా మన రాష్ట్రం డిజిటల్ పరిపాలన, స్టార్టప్స్, తీరప్రాంతాల ఆధునికీకరణతో ప్రపంచాన్ని తలదన్నే మౌలిక సదుపాయాల కల్పనలో దూసుకువెళుతుందని చెప్పారు. ముఖ్య అతిథిగా విచ్చే సిన అమెరికాలోని బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యం(సుబు కోట)కు గవర్నర్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ప్రతీ ఏడాది 25 లక్షల మంది గ్రాడ్యుయేట్లు, 3.5 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్నారన్నారు. చైనాతో పోలిస్తే భారత్‌లో గ్రాడ్యుయేట్లు 1.5 రెట్లు, అమెరికాతో పోలిస్తే రెండు రెట్లు ఎక్కువని తెలిపారు. సీఎస్ఈలో భారత్‌లో ఏటా 25 మంది మాత్రమే పీహెచ్‌డీలు అందుకుంటే, అమెరికాలో 800 మంది కంటే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. జేఎన్టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ పరిశోధన కోసం నూతన కోణాలను అవలంభించాలని, సమాజ శ్రేయస్సు కోసం పరిశోధన ప్రాజెక్టులను చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. వేడుకల్లో 99 మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు పీహెచ్‌డీలు, 35 మందికి బంగారు పతకాలు, ఐదుగురికి ఎండోమెంట్ అవార్డులను గవర్నర్, వీసీ ప్రదానం చేశారు. వర్సిటీ రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు

- విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు



సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు

బుట్టాయగూడెం, జూలై 4(ఆంధ్రజ్యోతి):'ప్రజల నుంచి వస్తున్న విద్యుత్ సమస్యలపై స్పందించి వెంటనే పరిష్కరించకుంటే చర్యలు తప్పవు. పనిచేయని వారిని వదులుకోవడానికి సంస్థ సిద్ధంగా ఉంది' అని జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ సాల్మన్‌రాజు అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. బుట్టాయగూడెం శుక్రవారం వచ్చిన ఆయన సబ్ స్టేషన్ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 'ఆర్‌డీఎస్ స్కీమ్ విషయంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలోని అన్ని గ్రామాల్లోని ప్రతి ఇంటికి 24 గంటలు విద్యుత్ సరఫరా చేయడం కోసమే ఆర్‌డీఎస్ స్కీమ్‌ను తీసుకొచ్చారు. జిల్లాలో 24 చోట్ల కొత్త సబ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నాం. అవసరమైన స్టేషన్లలో కెపాసిటీని పెంచుతున్నాం. జిల్లాలో 9 నుంచి 9.2 మిలియన్ల విద్యుత్ వాడకం జరుగుతోంది. జిల్లాలో 4.51 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఎస్సీ, ఎస్టీలకు 2.25 లక్షలు, బీసీలకు 2.50 లక్షల కనెక్షన్లు ఉండగా మిగిలినవి ఇతర కులాలకు చెందినవారు. జిల్లాలో 1,004 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నాయి. ఇవన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు చెందినవి.పీఎం సూర ఘర్ పథకంలో సోలార్ విద్యుత్ యూనిట్లను సబ్సిడీపై పంపిణీ చేస్తున్నాం. సోలార్ యూనిట్లను జిల్లాలో 2,600 పంపిణీ చేసి రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. జిల్లాలో 35 విద్యుత్ సరఫరా సెక్షన్లు ఉన్నాయి. బుట్టాయగూడెం, లింగపాలెం, కుక్కునూరు, నిడమర్రు సెక్షన్లలో నిరతరం విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజి, సిబ్బంది పనితీరుపై ప్రజాభిప్రాయం సేకరించగా పైనాలుగు సెక్షన్లు వెనుకబడి ఉన్నాయి. సీఎండీ ఆదేశాల మేరకు అన్ని సెక్షన్లలో సమీక్షలు జరిపి చర్యలు తీసుకుంటున్నాం. బుట్టాయగూడెం సబ్ స్టేషన్‌లో సిబ్బంది కొరత లేకున్నా ప్రజల నుంచి ఫిర్యాదులు ఎందుకు అందుతున్నాయి. పని తీరును మెరుగు పర్చుకోవాలి' అంటూ సూచించారు. తొలుత కార్యాలయ ఆవరణలో సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జంగారెడ్డిగూడెం డీఈ పీర్ అహ్మద్ ఖాన్, డీఈ టెక్నికల్ ఏలూరు రాధాకృష్ణ, ఏఈ శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.



ఎరక్కపోయి వచ్చా.. ఇరుక్కుపోయా !

పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామంలో తాడేపల్లిగూడెం ప్రధాన రహదారిపై ఉన్న వంతెనపై భారీ కంటైనర్ శుక్రవారం ఇరుక్కుపోయింది. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి ట్రాఫిక్ జాం అయ్యింది. ఈ వంతెన శిథిలావస్థకు చేరడంతో ఈ వంతెనపై భారీ వాహనాలను అనుమతించేది లేదని గతంలో అధికారులు ప్రకటించారు.ఆ హెచ్చరికలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా రావడంతో ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో కాలేజీ, స్కూల్ బస్సులు రావడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు.నిత్యం వేలాది వాహనాలు ఈ వంతెనపై నుంచి వెళుతుంటాయని, అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

\- పాలకోడేరు (ఆంధ్రజ్యోతి)

తల్లి ఒడే..ఆసుపత్రి బెడ్



తల్లి ఒడిలో బాలుడు

బాలుడు నీరసించి పడిపోతే వెంటనే పక్కనే ఉన్న తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ సిబ్బంది క్యాజువాలిటీలో పడుకోబెట్టి సెలైన్ ఎక్కించారు. అది తట్టుకోలేని తల్లి పిల్లాడి తలను ఒడిలో పెట్టుకుని సెలైన్ ఎక్కేవరకు కదలకుండా కూర్చొంది. ఆసుపత్రిలో రోగుల పట్ల సిబ్బంది నిత్యం ఇలాగే వ్యవహరిస్తున్నారని అక్కడ స్థానికులు ఆరోపిస్తున్నారు.

\-తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి)



వాహనానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

పోలీస్ శాఖకు బొలెరో ఇచ్చిన ఎమ్మెల్యే మద్దిపాటి

ఏలూరు క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల రక్షణకు పోలీస్ సేవలు మరింతగా అందించేందుకు 12 లక్షల రూపాయల విలువైన మహేంద్ర బొలెరో వాహనాన్ని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు విరాళంగా అందించడం పోలీస్ శాఖకు పెద్ద గౌరవమని ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ అన్నారు. ఎమ్మెల్యే వెంకటరాజు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ కిషోర్‌కు వాహనాన్ని అందజేశారు. ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్‌కు ఈ వాహనాన్ని అందించినట్టు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పోలీసు సేవలు మరింత మెరుగవ్వాలని ఆశిస్తున్నామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతల రక్షణకు ఉపయోగపడుతుందని అన్నారు. అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, భీమడోలు ఇన్‌స్పెక్టర్ విల్సన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఎఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్, హెడ్ కానిస్టేబుల్ రమేష్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పడుతూ..లేస్తూ సహకారం





పక్కదారి పట్టించిన వైసీపీ పాలకులు, అధికారులు

సంస్కరణలు చేస్తున్నా కోలుకోని వ్యవస్థ

టీడీపీ హయాంలోనైనా పూర్వవైభవం దక్కేనా?

నేడు అంతర్జాతీయ సహకార దినోత్సవం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) : గతమెంతో ఘనంగా ఉమ్మడి పశ్చిమలో సహకార రంగం సాగింది. 30 బ్రాంచిలు 258 సహకార సంఘాలతో నిండుకుండుగా సహకార రంగం ఉత్తేజితమై ఉండేది. 2006 నుంచి 2010లో జిల్లా డీసీసీబీ బ్యాంకు కనపరిచిన ప్రతిభకు మూడు సార్లు నాబార్డు నుంచి జాతీయస్థాయిలో పురస్కారాలను అందుకుంది. అటువంటి ఈ రంగం ఐదేళ్ల వైసీపీ పాలన కారణంగా పూర్తిగా భ్రష్టుపట్టిపోయింది. రూ.90 కోట్ల పైబడి నష్టాల్లోకి నెట్టేశారు. దర్జాగా కార్యదర్శులను అడ్డపెట్టుకుని కొందరు పాలకులు, వారిని అడ్డం పెట్టుకుని ఇతర సిబ్బంది నిధులను పక్కదారి పట్టించేశారు. దీంతో సహకార రంగం జిల్లాలో కుదేలైపోయింది. 30 మందికి పైగా అడ్డంగా సొసైటీలను సొమ్మును స్వాహా చేశారు. అసలు రంగు బయటపెట్టాల్సిన విచారణాధికారుల సైతం చేతులు ముడుచుకోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఎంతో ఘనమైన చరిత్రకు మరకలు అంటుకున్నాయి. ఈ నెల ఐదో తేదీన 103 అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా పాత విషయాలు జప్తికి తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. 'అందరి కోసం ఒకరు.. ఒకరి కోసం అందరూ' అనే నినాదం సహకార రంగంలో ఒక కీలకం. రాబోయే రోజుల్లో ఇది రైతుల పక్షాన సేవలందించే విధంగా చూపిస్తే అటు కేంద్రానికి, ఇటు రాష్ట్రానికి రైతులు రుణపడి ఉంటారు.

కొంత పుంతలు తొక్కడానికి..

రైతులకు ఇతోధికంగా సేవలందించే సహకారశాఖ శాఖ మనుగడ ప్రమాదంలో పడే పరిస్థితులు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాపురించాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ సంఘాల అభివృద్ధి తీవ్రంగా కుంటుపడింది. దీంతో 19 ఏళ్ల క్రితం సహకార సంఘాల కుదేలైనప్పుడు వైద్యనాథన్ కమిటీ సిఫార్సులతో నాబార్డు ఆర్థిక సహకారంతో జిల్లాలో 80కు పైగా సంఘాలకు ఇతోధికంగా నిధులిచ్చి పునరుజ్జీవం కల్పించారు. అవన్నీ కోలుకుని వ్యాపారం సాగిస్తూ, రైతులకు అన్ని సేవలం దిస్తూ అనుబంధ సంఘాలకు రుణాలను ఇచ్చే దశలోనే వైసీపీ పాలనతో సొసైటీలు భ్రష్టు పట్టించారు. కాగా టీడీపీ అధికారంలోకి వచ్చిన కొద్దినెలల్లోనే సహకార సంఘాల్లో జవాబు దారీతనం కోసం సొసైటీల కంప్యూటరీకణ చేశారు. అది పూర్తయి రైతులకు ఆన్‌లైన్‌లో పారదర్శకంగా సేవలందుతున్నాయి. ఇటీవలే ఒక్క అడుగు ముందుకేసి ఈ-ఆడిట్ విధానానికి శ్రీకారం చుట్టింది. దీంతో పాటు దేశంలో ఏకీకృత సహకార వ్యవస్థ కోసం కేంద్రం కూడా 2021లోనే కేంద్ర సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. రాబోయే రోజుల్లో సహకార రంగం విస్తరించడానికి, వ్యవసాయంతో పాటు ఆక్వా, ఇతర ప్రాసెసింగ్ రంగాల్లోకి ప్రవేశించి ఆర్థికంగా రైతులను బలోపేతంగా చేసే దిశగా ఒకే పంట ఉత్పత్తి చేసే వారితో ఫెడరేషన్లు ఏర్పాటు చేస్తోంది. సరికొత్త గోడౌన్లు నిర్మాణం.. మరోవైపు వేర్ హౌసింగ్ కార్పొరేషన్ సొసైటీ గోడౌన్లను అద్దెలకు ఇచ్చి వాటిని కూడా ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రణాళిక రచన సాగింది.

అంతర్జాతీయ దినోత్సవ స్ఫూర్తి అందుకోనేనా ?

ఉమ్మడి జిల్లాలో అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు ఇటీవల చేపట్టారు. ఈ నెల ఐదున డీసీసీబీ, డీసీఎంఎస్, డీసీవో కార్యాలయాల్లో సహకార జెండాలను ఆవిష్కరించి, వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగానే 2025 అంతర్జాతీయ సహకార సంవత్సరం ప్రపంచానికి అందిస్తున్నది ఏమిటంటే భాగస్వామ్యాలను నిర్మించడానికి ఈ ఏడాది ఒక వేదికగా మలచాలని యోచిస్తున్నారు. ఈ రంగం మరింత విస్తరించుకోవాల్సిన వాతావరణం ఏర్పడిందని చెప్పడానికి ప్రపంచంలో అన్ని రంగాలతో చేతుల కలిపి ఒక సమ్మిళత, సుస్థిరమైన ప్రపంచాన్ని సృష్టించడానికి 1923 నుంచి జరుపు కుంటున్న 'అంతర్జాతీయ సహకార సంవత్సరం'గా ఐరాస 2025ను ప్రకటించింది. ఈ సంవత్సరం మరింత శోభాయ మానంగా, ఆదర్శవంతంగా ప్రజలందరితో మమేకమై సమాజా భివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నాయి. ఇందులో డీసీసీబీ చైర్మన్, డీసీఎంఎస్ చైర్మన్‌లతో పాటు పాలకులు కలిసి నడిస్తే సహకార రంగం మళ్లీ జవసత్వాలు కూడగట్టుకుందని ఆశించవచ్చు.

ప్రొటోకాల్ డ్యూటీ తొలగించడం పట్ల హర్షం

ఏలూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖ నుంచి ప్రొటోకాల్ డ్యూటీ తొలగించడం పట్ల రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు హర్షం ప్రకటించారు. సీఎంవో అధికారులు సమక్షంలో జరిగిన రెవెన్యూ సమీక్ష సమావేశంలో అనేకమైన భూసంబంధిత నిర్ణయాలు, రెవెన్యూ అధికారులు ప్రొటోకాల్ విషయంలో జరుగుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, విధుల్లో ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ నుంచి ప్రొటోకాల్ డ్యూటీలు తీసివేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, రెవెన్యూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో రైతులకు రాజముద్రతో పాస్ పుస్తకాలు ఇవ్వడానికి నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు. ప్రస్తుతం రేషనలైజేషన్ ప్రక్రియలో వీఆర్‌వోలు ఎదుర్కొంటున్న ఇబ్బంది లపై కూడా సీఎం చంద్రబాబు నష్టం జరగకుండా చూడాలని ఆదేశించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న గ్రామ, రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో రెవెన్యూ సమస్యలపై రైతులకు, ప్రజలకు సేవలు అందించడానికి పారదర్శకంగా కృషి చేస్తామని భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు తెలిపారు.

బలరామునిగా జగన్నాథుడు



ద్వారకాతిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆదిశేషుని అవతారంగా చెప్పే బలరాముడుగా జగన్నాథుడు శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీపురంలోని ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో నాగలిని ధరించిన బలరాముని అలంకరణలో జగన్నాథుని దర్శనం భక్తజనులను అలరించింది.

ఉద్యోగాలు వస్తాయా ?

పునర్నియామకాల కోసం ఆరోగ్య సహాయకుల ఎదురుచూపులు

'ఆంధ్రజ్యోతి'కి పరిస్థితి వివరించిన ఏపీ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ రాష్ట్ర కన్వీనర్ ప్రసాద్




ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌తో చర్చిస్తున్న ఉద్యోగులు (ఫైల్)

ద్వారకాతిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వారంతా వైద్య ఆరోగ్య శాఖలో గ్రామీణ స్థాయిలో కీలక భూమిక పోషించే ఆరోగ్య సహాయకులు.. ఉద్యోగాలు కోల్పోయి ఎనిమిది నెలలు అవుతోంది... ఇరవై రెండేళ్ల సర్వీసు.. ఒక్కొక్కరికీ యాభై ఏళ్ల వయసు దాటింది. ఉద్యోగాలు లేవు.. ఉపాధి లేదు.. ఎలా బతకాలో తెలియక దాదాపు 920 కుటుంబాల ఆకలితో అల మటిస్తున్నాయి.. వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు కోల్పోయిన ఆరోగ్య సహాయకుల పరిస్థితిని ఏపీ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ శుక్రవారం ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానంతరం ఆయన మాట్లాడుతూ చిరుద్యోగులమైన తాము ఉద్యోగాలు కోల్పోవడంతో తమ కుటుంబాలు చిన్నాభిన్నమై రోడ్డున పడ్డామన్నారు. కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నాం. ఉద్యోగాలు కోల్పోయి 8 నెలలు అవుతున్నా వైద్య ఆరోగ్యపరంగా జరిగే సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొంటున్నట్లు చెప్పారు. కొవిడ్ సమయంలో, విజయవాడ ముంపు సమయంలోనూ సేవలందించామన్నారు. ఉద్యోగాలు కోల్పోవడంతో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించినా ప్రభుత్వం మంచి చేస్తుందంటే కేసును సైతం వాపసు తీసుకుంటానికి తాము సిద్ధమని ప్రసాద్ తెలిపారు. ఆరోగ్య సహాయకుల పునర్నియామకం కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌తో గతేడాది డిసెంబరులో చర్చించామన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో ముందు కొచ్చి అందరికీ న్యాయం చేస్తానంటే కోర్టులు, కేసులు ఉండవని తమకు కావాల్సింది తమ ఉద్యోగాలే అంటూ వివరించారు.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24- వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
- మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
- సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
- వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.



ఉపాధ్యాయిని వద్ద రోదిస్తున్న విద్యార్థులు

వచ్చేయండి టీచర్..

బదిలీ అయిన ఉపాధ్యాయురాలి వద్ద విద్యార్థుల కంటతడి

సిద్ధాపురం పాఠశాలలో పిల్లల ప్రేమకు టీచర్ భావోద్వేగం

ఆకివీడు రూరల్ జూలై 4(ఆంధ్రజ్యోతి):అంకితభావంతో పనిచేస్తే పిల్లలు, పెద్దల మనసులో చోటు సంపాదించుకోవచ్చని ఆ టీచర్ నిరూపించారు. ఆకివీడు మండలం సిద్ధాపురం ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలు ప్రసన్నదుర్గ 8 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల దుంపగడప పాఠశాలకు బదిలీ అయ్యారు. మరో టీచర్‌కు చార్జి అప్పగించడానికి శుక్రవారం ఆమె సిద్ధాపురం పాఠశాలకు వెళ్లడంతో విద్యార్థులు ఆమెను చుట్టుముట్టారు. మీరు వెళ్లకండి టీచర్.. ఇక్కడకే వచ్చేయండి టీచర్.. అంటూ కంటతడి పెట్టుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కన్నీటితో టీచర్‌ను పలకరించారు. వారి అభిమానంతో ఉపాధ్యాయురాలు కూడా భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు. పిల్లలు ఇంత ప్రేమ చూపడంతో తన జన్మధన్యమైందని ఆమె అన్నారు. అనంతరం ఉపాధ్యాయురాలిను అభినందించి సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు అప్పారావు, సహేదా, పద్మ, పార్వతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఉపాధికి తృప్తి క్యాంటీన్



ఫలహారాలు, భోజనం మార్కెట్‌కు విస్తృతి ఎక్కువ. ఉమ్మడి జిల్లాలో కోట్లలో వ్యాపారం సాగుతున్నట్లు అంచనా. దీనిలో మహిళలకు ఉపాధి చూపేందుకు కూటమి సర్కారు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. మెప్మా ద్వారా పట్టణ ప్రాంతాల్లో తృప్తి క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకురానుంది. నెల్లూరులో ప్రయోగాత్మకంగా తృప్తి క్యాంటీన్ ఏర్పాటుతో మంచి స్పందన వచ్చింది. ఉభయ గోదావరి జిల్లాలో 57 క్యాంటీన్లు ఏర్పాటు చెయ్యాలని లక్ష్యం.

- మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుకు చర్యలు
- ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 57 క్యాంటీన్‌లకు ప్రతిపాదనలు
- మహిళా అభ్యున్నతికి ప్రభుత్వ నిర్ణయం

భీమవరం టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తృప్తి క్యాంటీన్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి భీమవరంలో 17, పాలకొల్లులో 4, తాడేపల్లిగూడెంలో 5, తణుకులో 4 మొత్తం 34 ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించారు. ఏలూరు జిల్లా చింతలపూడిలో 2, ఏలూరులో 16, నూజివీడులో 2 మొత్తం 23 ఏర్పాటు చెయ్యనున్నారు. పశ్చిమలో 9,500 గ్రూపుల్లో 95 వేల మంది సభ్యులున్నారు. ఏలూరు జిల్లాలో 7,500 గ్రూపుల్లో 75 వేల మంది సభ్యులున్నారు.

పట్టణాల్లోని ముఖ్య కూడళ్ల, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రదేశాలను ఎంపిక చేస్తారు. 24 గంటలు పని చేసేవిధంగా చర్యలు తీసుకోనున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు ఇప్పించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. అవసరమైన పరికరాలు అందించి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనంతో క్యాంటీన్లు ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నారు. షెఫ్స్ (వంట మనుషులు), అవసరమైతే ప్రతి పూట అధికారులు ఆహార తనిఖీచేసి సూచనలు ఇస్తారు. టిఫిన్, భోజనం చేసే వారి అభిప్రాయాలను తెలుసుకుని వారు సంతృప్తి చెందే ఆహారాన్ని అందిస్తూ క్యాంటీన్లు నిర్వహిస్తారు.

నలుగురు మహిళలతో యూనిట్

నలుగురు మహిళా సభ్యులతో ఒక యూనిట్‌గా ఏర్పాటుచేసి క్యాంటీన్ అప్పగించనున్నారు. క్యాంటీన్ నిర్వహణకు 20 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో ఒక కంటెయినర్‌ను అందించనున్నారు. వంటలు, క్యాంటీన్ నిర్వహణపై ప్రత్యేక శిక్షణ మెప్మా ఆధ్వర్యంలో ఇప్పించనున్నారు. పర్యావరణను దృష్టిలో పెట్టుకుని అవసరమైతే పీఎం సూర్యఘర్ కింద సౌర విద్యుత్ సౌకర్యం కల్పించేవిధంగా ప్రతిపాదనలు రూపొందించనున్నారు. క్యాంటీన్ నిర్వహణకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తారు. క్యాంటీన్ ఏర్పాటుకు రూ.16.40 లక్షలు పెట్టుబడి అవసరం. ఒక్క క్యాంటీన్‌కు నలుగురు సభ్యులకు రూ.3.10 లక్షల చొప్పున రూ.12.40 లక్షలు అవసరం. మిగిలిన మొత్తం కంటెయినర్, యంత్ర పరికరాలు, సౌర విద్యుత్ ఇతర అవసరాలకు మెప్మా చేయూతనిస్తుంది. మహిళలకు ఆర్థిక భరోసానిస్తుంది.

ప్రతిపాదనలో ఉన్నాయి



జిల్లాలో 34 చోట్ల తృప్తి క్యాంటీన్లు ఏర్పాటుచెయ్యాలని ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రస్తుతం పరిశీలన చేస్తున్నాం. గ్రూపు నుంచి నలుగురిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. దీనిపై కసరత్తు చేస్తున్నాం. పైలెట్ ప్రాజక్టుగా పెట్టిన ప్రాంతాల్లో మంచి ఫలితాలు వచ్చినట్లు చెబుతున్నారు. త్వరలో కార్యరూపంలోకి తీసుకువస్తాం.

హెప్సిబా, మెప్మా జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్

నరసాపురం-అరుణాచలం మధ్య ప్రత్యేక రైలు



నరసాపురం, జూలై 4(ఆంధ్రజ్యోతి):నరసాపురం - అరుణాచలం(తిరువణ్ణామలై) మధ్య ప్రతి బుధవారం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్ల నడుపుతున్నట్లు స్టేషన్ మేనేజర్ మధుబాబు శుక్రవారం చెప్పారు. 07219 నెంబరుతో ఈ రైలు ప్రతి బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు నరసాపురంలో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 5 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. గురువారం మధ్యాహ్నం 11 గంటలకు అక్కడ బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజాము 3 గంటలకు నరసాపురం వస్తుందన్నారు. ఆగస్టు నెలాఖరు వరకు పాలకొల్లు, భీమవరం జంక్షన్, టౌన్, ఆకివీడు, ఒంగోలు, తిరుపతి, చిత్తూరు, కాట్‌పాడి, వెల్లూరు మీదుగా నడుస్తుందన్నారు. రాష్ట్రం నుంచి నేరుగా అరుణాచలం వెళ్లే తొలి రైలు ఇదే కావడం గమనార్హం. ప్రస్తుతం అరుణాచలం వెళ్లాలంటే తిరుపతి, కాట్‌పాడి నుంచి రోడ్డు మార్గంలో వెళ్లాల్సి ఉంది. విజయవాడ నుంచి వారానికి నేరుగా ఒక్క రైలు మాత్రమే అరుణాచలం మీదుగా నడుస్తోంది. ఇది ఢిల్లీ నుంచి వస్తుండడంతో రిజర్వేషన్ దొరకని పరిస్థితి. ఉభయ గోదావరి జిల్లావాసులు చాలా కాలం నుంచి అరుణాచలం రైలు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నేతలు, ప్రయాణికుల వినతి మేరకు రైలు వేయడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల భారం వద్దు!

ఆచంట సహకార సంఘానికి రూ. 2.14 కోట్ల కేంద్ర రుణం



గ్రామీణ బ్యాంక్‌గా సహకార రంగంలో ఒక వెలుగు వెలిగిన ఆచంట మృత్యుంజయ విశాల పరపతి సంఘంపై పైలట్ ప్రాజెక్ట్ పేరుతో అప్పుల భారం మోపవద్దని సభ్యులు నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నారు. సొంత స్థలం, ఆర్థికంగా పటిష్టంగా ఉన్న సొసైటీని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి రైస్‌మిల్లు నిర్మాణానికి అధికారులే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే సొసైటీకి సొంత రైస్ మిల్ ఉన్నా అప్పు ఇచ్చి మరీ మళ్లీ నిర్మించడం ఏమిటని సభ్యులు, రైతులు ప్రశ్నిస్తున్నారు. ఉన్న రైస్ మిల్లు నిర్వహణకు చేయూతనిస్తే రైతులకు ప్రయోజనం అంటున్నారు.

- రెండేళ్ల క్రితం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక
- రుణంలో సంఘం వాటా రూ.42.86 లక్షలు
- రైస్ మిల్లు నిర్మాణానికి చర్యలు
- అధికారులే ప్రతిపాదనలు సిద్ధం చేశారు
- తీవ్రంగా వ్యతిరేకించిన సొసైటీ సభ్యులు
- వద్దంటూ మహాజన సభ తీర్మానం
- కూటమి సర్కార్ నిలుపుదల చేస్తుందని ఆశ



మహాజన సభలో అభ్యంతరం చెబుతున్న సభ్యులు (ఫైల్)

ఆచంట, జూలై 4(ఆంధ్రజ్యోతి): రైతులకు విశేష సేవలందిస్తున్న మృత్యుంజయ సహకార సంఘంపై కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పైలెట్ ప్రాజెక్ట్‌తో అప్పుల భారం పడనుంది. 2023లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 11 రాష్ట్రాల్లో 11 చోట్ల వరల్డ్ లార్జెస్ట్ గ్రెయిన్ స్టోరేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు చేపట్టింది.

రాష్ట్రంలో ఆచంట సొసైటీని ఎంపిక చేయడంతో రూ.2.14 కోట్లతో రైస్‌మిల్లు నిర్మాణానికి ప్రతిపాదించారు. కేంద్ర రుణంతో సొసైటీ వాటా రూ.42.86 లక్షలు చెల్లించాలి. 2023 ఏప్రిల్ మంజూరు కాగా ప్రత్యేకాధికారుల పాలనలో సభ్యులకు సమచారం అందించారు. అనంతరం జరిగిన మహాజన సభలో సొసైటీ సభ్యులు రుణ భారంపై తీవ్ర వ్యతిరేకించారు. ఇప్పటికే ఉన్న మిల్లు నిర్వహణ భారంతో లీజుకు ఇచ్చారని, ఇప్పుడు అప్పు తీసుకుని మరో మిల్లు నిర్మాణం ఎందుకని సభ్యులు, రైతులు అభ్యంతరం తెలిపారు. మహాసభ తీర్మానం చేసినా అధికారులు ఖాతరు చేయకుండా రైస్ మిల్లు నిర్మాణం చేపట్టారు. దీనితో పలువురు సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. సొసైటీ అధికారులు కూడా కోర్టును ఆశ్రయించడంతో వేలాది రూపాయల భారం పడిందని రైతులు చెబుతున్నారు. రైస్‌మిల్లు నిర్మాణం కోర్టు స్టే కారణంగా నిలిచిపోయింది. సొసైటీ సభ్యుల అభిప్రాయానికి విరుద్ధంగా అధికారులు వ్యవహరించడంతో గ్రామస్థులు, రైతులు, అఖిలపక్ష నాయకులు కూడా అప్పట్లో ఆందోళనలు చేపట్టారు. ఒక సమయంలో సొసైటీలో డిపాజిట్‌లు కూడా వెనక్కి తీసుకున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి అధికారులు ముందుకు వెళ్లడానికి ప్రయత్నించడంతో సొసైటీ దివాలా తీస్తుందని ఖాతాదారులు, రైతులు పలుసార్లు సొసైటీ వద్ద సమావేశాలు ఏర్పాటుచేసి తీర్మానాలు కూడా చేశారు. అప్పట్లో ప్రజాప్రతినిధులు కూడా ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని సభ్యులు, రైతులు, అఖిల పక్ష నాయకులు కోరుతున్నారు.



గవర్నర్ నజీర్‌ను ఆహ్వానిస్తున్న వీసీ

ఉద్యాన వర్సిటీ స్నాతకోత్సవానికి

గవర్నర్‌కు ఆహ్వానం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి):వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ స్నాతకోత్సవానికి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌ను వర్సిటీ వీసీ కె.గోపాల్ శుక్రవారం ఆహ్వానించారు. ఎన్టీఆర్ జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూర్ స్వర్ణభారతి ట్రస్ట్‌లో నిర్వహించే స్నాతకోత్సవానికి పాల్గొనాలని కోరారు. గవర్నర్ ముఖ్య కార్యదర్శి ఎం.హరి జవహర్‌లాల్‌ను కూడా ఆహ్వానించారు. వర్సిటీ పురోగతిని గవర్నర్‌కు నివేదించారు. ఆయన వెంట రిజిస్ట్రార్ బి శ్రీనివాసులు ఉన్నారు.

ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోగల ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అడ్మిషన్లకు కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభించారు. తొలిరోజు మొత్తం 505 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపగా 475 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. 430 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వీరిలో బాలురు 128 మంది, బాలికలు 302 మంది ఉన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమంలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్, ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ భాస్కర్ పటేల్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ రూపేష్ కుమార్, పరిపాలన అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నేటి నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

చింతలపూడి, జూలై 4(ఆంధ్రజ్యోతి):సీపీఐ ఏలూరు జిల్లా మహాసభలు ఈనెల 5, 6, 7 తేదీల్లో చింతలపూడిలో జరుగుతాయని జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య తెలిపారు. సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో జిల్లాలో సీపీఐ పోరాటాలు వివరించారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, నిర్వాసితులు త్యాగధనులని ప్రభుత్వం పొగుడుతుందని, నిర్వాసితులకు నష్టపరిహారం అందించి మెరుగైన సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు 45.67 మీటర్ల ఎత్తులో కడితేనే ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు నీరందుతుందన్నారు. 41 మీటర్లకు కుదించి ప్రాజెక్ట్‌ను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మహాసభల్లో పలు సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. 5న చింతలపూడిలో బహిరంగ సభ, ర్యాలీ జరుగుతుందని, 6, 7 తేదీల్లో యర్రగుంటపల్లి రాధాగార్డెన్‌లో ప్రతినిధుల సభలు జరుగుతాయన్నారు. ఎం.వసంతరావు, టి.బాబు పాల్గొన్నారు.



వంగవీటి రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వంగవీటి రాధా, ఎమ్మెల్యే నాయకర్, మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు తదితరులు

రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన తనయుడు రాధా

మొగల్తూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి):దివంగత వంగవీటి మోహనరంగా జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాళీపట్నం తూర్పు గ్రామంలో మేడిద బాబ్జి కుటుంబ సభ్యులు పునర్నిర్మించిన రంగా విగ్రహాన్ని ఆయన తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి చిన్నా ఆవిష్కరించారు. వంగవీటి రంగా పేదలు, దళితుల కోసం అనేక పోరాటాలు చేసి ప్రాణ త్యాగం చేశారన్నారు. మండలంలోని లోసరి వంతెన వద్ద నుండి గ్రామస్థులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి రంగా తనయుడు రాధాకు స్వాగతం పలికారు.

రంగా జయంతిని పురస్కరించుకుని గ్రామంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు మేడిద బాబ్జి తనయుడు ప్రవాస భారతీయుడు అశోక్ కుమార్ రత్నశైలజ, గ్రామ సర్పంచ్ మేడిద సౌజన్య ప్రభాకర్‌లు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాపు సంఘ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, జనసేన నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు మేకల సతీష్‌లతోపాటు వందలాదిమంది రంగా అభిమానులు పాల్గొన్నారు.



మందుల షాపుల్లో తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిద్ అలీ షేక్, స్వాధీనం చేసుకున్న అబార్షన్ మందుల కిట్లు

నిషేధిత మందుల గుట్టురట్టు

బుట్టాయగూడెంలో అబార్షన్ కిట్‌లు స్వాధీనం

బుట్టాయగూడెం, జూలై 4(ఆంధ్రజ్యోతి): నిషేధిత లైంగిక ప్రేరేపిత మందులు, గర్భం విచ్ఛిత్తికి (అబార్షన్ కిట్లు) వాడే మందుల అమ్మకాల గుట్టును జంగారెడ్డిగూడెం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అబిద్ అలీ షేక్ రట్టు చేశారు. బుట్టాయగూడెం మందుల షాపుల్లో యథేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించారు. తనిఖీలు చేసిన అధికారులు భారీ మొత్తంలో నిషేధిత మందులను బిల్లులు లేకుండా అమ్ముతున్నట్లు గుర్తించి మందులను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీదుర్గ, కార్తికేయ, కృష్ణ మెడికల్ షాపుల్లో తనిఖీలు చేసి మందులను గుర్తించి కేసులు నమోదు చేశారు. మందులను హైదరాబాద్ నుంచి తెప్పించుకుని అమ్ముతున్నారని గుర్తించారు. మందులను ఎంతమందికి అమ్మారనే విషయాన్ని పట్టుబడిన వ్యక్తి నుంచి తెలుసుకున్నామని మరిన్ని చర్యలు తీసుకుంటామని అబిద్ అలీ షేక్ తెలిపారు.



అదుపు తప్పి పంట బోదెలోకి దూసుకుపోయిన కారు, మృతి చెందిన వ్యవసాయ కూలీ పెద్దిరాజు

కారు ఢీకొని వ్యవసాయ కూలీ మృతి

మొగల్తూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పి పంటబోదెలోకి దూసుకుపోవడంతో గట్టుపై గడ్డి కోస్తున్న వ్యవసాయ కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. భీమవరానికి చెందిన ఐదుగురు యువకులు పేరుపాలెం బీచ్‌కు కారులో వెళ్లారు. శుక్రవారం సాయంత్రం వారు తిరిగి భీమవరం వెళుతుండగా పేరుపాలెం నార్త్ పంచాయతీ పరిధి సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం సమీపంలో గల పంట బోదెలోకి కారు దూసుకుపోయింది. గట్టు వద్ద పశువులకు గడ్డి కోస్తున్న వ్యవసాయ కూలీ గుత్తుల పెద్దిరాజును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈసంఘటనపై పెద్దిరాజు భార్య ఫిర్యాదు మేరకు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపల పట్టుబడికి వెళ్లి యువకుడి మృతి

ముదినేపల్లి, జులై 4(ఆంధ్రజ్యోతి):చేపల పట్టుబడికి వెళ్లి చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ముదినేపల్లి మండలం పెదగొన్నూరు గ్రామానికి చెందిన అవ్వారు హేమంతరావు (30) తాపీ పని చేస్తాడు. ఈ నెల 1న తాపీ పని లేకపోవడంతో చేపల పట్టుబడికి వెళ్లగా అదే చెరువులో జారి మునిగి పోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని పెదఅవుటపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. హేమంతరావుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలు'



పోలీసుల అదుపులో నిందితులు, కేసు వివరాలు చెబుతున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్


ఒంటరి వృద్ధులే లక్ష్యంగా..

ఏలూరు క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న వృద్ధులే ఆ ముఠాకు టార్గెట్. దాడులకు తెగబడి బంగారాన్ని అపహరించే ముఠాను కైకలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ముఠా వివరాలను వెల్లడించారు. కైకలూరు రూరల్ మండలం రాయవరంలో మే 28న ఒంటరిగా ఉంటున్న గూడూరి నాగలక్ష్మి (62) వద్దకు ఇద్దరు యువకులు వెళ్లి ఆమె తలను గోడకేసి కొట్టి గాయపరిచారు. స్పృహ తప్పిన ఆమె మెడలో బంగారు చైన్, గాజులు అపహరించుకుపోయారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. నేరాలకు పాల్పడిన అదే గ్రామానికి చెందిన పంతగాని జాన్‌కుమార్, గరికముక్కు రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి వారి నుంచి చోరీకి గురైన ఆభరణాలు స్వాధీనం చేసుకన్నారు.

రాయవరం గ్రామానికి చెందిన సోము సీతామహలక్ష్మి (65) కిరాణా కొట్టు నిర్వహిస్తుంది. 2024 ఫిబ్రవరి 13న నలుగురు దొంగలు ఆమెపై దాడి చేసి రెండు బంగారు గాజులు అపహరించుకుపోయారు. అదే గ్రామానికి చెందిన భూపతి ప్రదీప్ అలియాస్ బన్ను, కురేళ్ల సుబ్బారావు అలియాస్ సుబ్బును అరెస్టు చేసి రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు.

వైద్యుని ఇంట్లో..


ఏలూరు క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి):ఒక వైద్యుడు ప్లాటుకు తాళం వేసి డ్యూటీకి వెళ్లి తిరిగి వచ్చేటప్పటికి దొంగలు బంగారు ఆభరణాలు, వజ్రాలను అపహరించారు. దాసరి లోకనాథం (69) ఆశ్రం ఆసుపత్రిలో వైద్యునిగా పనిచేస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన భార్య చీరాల బంధువుల ఇంటికి వెళ్లారు. పనిమనిషి వచ్చి ఇంటి తాళం తీసి పనిచేసుకుని వెళ్లిపోతుందని ప్లాట్‌కు తాళం వేసి తాళాన్ని పక్కనే పెట్టారు. పనిమనిషి ప్రతి రోజు పనిచేసి తాళం అక్కడ పెట్టి వెళ్లిపోతుంది. ఈనెల 3న డాక్టర్ లోకనాథం ఉదయం 9 గంటలకు వెళ్లి సాయంత్రం వచ్చేసరికి తాళం చెవి కనిపించలేదు. అక్కడ ఉన్న వారి సహకారంతో తాళం పగులగొట్టారు. లోపల బీరువా పగులగొట్టి, ఇంట్లో వస్తువులు చెల్లాచెదరుగా పడిఉన్నాయి. బీరువాలోని 70 కాసుల బంగారు ఆభరణాలు, వజ్రాల హారం, కొన్ని వజ్రాలు అపహరించినట్లు గుర్తించారు. వెండి వస్తువులు, నగదు, బంగారు బిస్కెట్లు బీరువాలోనే ఉన్నాయి. దొంగ యధావిధిగా ఇంటికి తాళం వేసి తాళం చెవి పట్టుకుపోయాడు. డాక్టర్ ఫిర్యాదుతో శుక్రవారం ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్స్‌తో పరిశీలన చేయించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

అమ్మవారి ఆలయంలో..

ద్వారకాతిరుమల, జూలై 4(ఆంధ్రజ్యోతి): గుండుగొలను కుంటలో కండిగలమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు జొరబడి వెండి, బంగారు ఆభరణాలు, హుండీలో నగదును అపహరించారు. గురువారం రాత్రి 10గంటల ప్రాంతంలో నిర్వాహకులు ఆలయానికి తాళాలు వేసి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం తలుపులు తెరచి ఉన్నాయి. అమ్మవారి విగ్రహానికి ఉండే రెండున్నర కేజీల వెండి కిరీటం, పట్టీలు, బంగారు కళ్లు, మంగళసూత్రం, ముక్కుపుడక మాయమైనట్లు గుర్తించారు. భక్తులు సమర్పించిన చీరలు, హుండీని సైతం తీసుకుపోయారు. ఎస్ఐ సుధీర్ సిబ్బంది ఆలయ పరిసరాలను, క్షుణ్ణంగా పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఆలయ పరిసరాల్లో క్లూస్ టీం పరిశీలన

గ్రామ కార్యదర్శిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

భీమడోలు, జూలై 4(ఆంధ్రజ్యోతి):భీమడోలు గ్రామ పంచాయతీ కార్యదర్శిపై పోలీసు స్టేషన్‌లో ఎస్సీఎస్టీ కేసుతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. భీమడోలు గ్రామానికి చెందిన కొత్తపల్లి చంద్రమౌళి గతంలో గ్రామ కార్యదర్శి కోటి రూపాయలకుపైగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని జిల్లా అధికారులకు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరంచంద్రమౌళి ఇంటి ప్రహరీ పంచాయతీ డ్రెయిన్‌పై నిర్మించాడంటూ ఎటువంటి నోటీసులు లేకుండా గ్రామ పంచా యతీ కార్యదర్శి జేసీబీతో ప్రహరీని కూల్చివేశారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విధుల్లో ఉన్న పంచాయతీ సిబ్బందిని అడ్డుకున్నారంటూ చంద్రమౌళిపై కేసు నమోదు చేశారు. చంద్రమౌళి తనకు జరిగిన అన్యాయంపై కలెక్టర్, పంచాయతీ ప్రిన్సిపల్ కార్యదర్శి, కమిషనర్, మానవ హక్కుల సంఘం ఎస్సీ ఎస్టీ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనితో కార్యదర్శిపై భీమడోలు పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

చోరీ సొత్తు, నగదు బాధితులకు అందించిన ఎస్పీ

ఏలూరు క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి):కైకలూరు రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలోని వివిధ దొంగతనాల కేసుల్లో రికవరీ చేసిన బంగారు ఆభరణాల నగదును ఎస్పీ కిశోర్ స్వయంగా బాధితులకు అందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం బాధితులకు వస్తువులను అందించడంతో వారంతా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపి నమస్కరించారు. పోయిన వస్తువులు తమకు వస్తాయో లేదోనని ఎంతో బాధతో ఉన్నామని, పోయిన ప్రతి వస్తువు అందించడంతో కలో నిజమో తెలియడం లేదనే పరిస్థితుల్లో ఆనందంగా ఉన్నామంటూ బాధితులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ద్వారా ఆన్‌లైన్ పెట్టుబడులు పెట్టి పోగొట్టుకున్న సొమ్మును కూడా సైబర్ సెల్ ద్వారా రికవరీ చేసి ఆ సొమ్ములను కూడా బాధితులకు అందించారు. ఏఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ దాసు, అధికారులు పాల్గొన్నారు.

'పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి'

పెదపాడు, జులై 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పన జరగాలని, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాల్సి ఉందని ఎంఈవో సబ్బితి నరసింహమూర్తి తెలిపారు. రాజుపేట ప్రాథమిక పాఠశాలను శుక్రవారం పరిశీలించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నాణ్యత, ఇతర వసతులను పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి వారి నుంచి సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పచ్చదనం ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలి'

బుట్టాయగూడెం, జూలై 4(ఆంధ్రజ్యోతి): పచ్చదనం ప్రాముఖ్యతను అందరూ గుర్తించి ప్రతిఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా పెంచాలని జంగారెడ్డిగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం సూపరింటెండెంట్ బి.శ్రీహరి తెలిపారు. కేంద్రీయ పొగాకు బోర్డు స్వర్ణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెడ్డిగణపవరం జడ్పీ హైస్కూల్లో మొక్కలు నాటారు. రైతులకు, విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. వేలం కేంద్రం అధికారులు సుధీర్, ఠాగూర్, ప్రణతికుమార్, రైతులు రాజేంద్రప్రసాద్, సోమేశ్వరావు, వీరకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.



ఏలూరు ఆర్టీసీ డిపో ముందు నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

ఆర్టీసీ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

ఏలూరు/జంగారెడ్డిగూడెం, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని, పదోన్నతులకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏలూరు ఆర్టీసీ డిపో ముందు, జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గేట్ మీటింగ్ రీజనల్ ప్రెసిడెంట్ కేవీ రామవులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు డిపో గౌరవాధ్యక్షుడు వై.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని, రిటైర్డు ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సెక్రటరీ టి.బాబూరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పీఎంకేరావు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. డిపో సెక్రటరీ డి.ఆంజనేయులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెంలో ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ జాయింట్ సెక్రటరీ రంగనాయకులు, డిపో కార్యదర్శి ప్రవీణ్, కె.ప్రసాద్, కేవీ రావు, వసంత, చిన్నయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న పాస్టర్ జోయల్

రక్తదానం చేయండి.. ప్రాణాన్ని నిలపండి

ఏలూరురూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయండి.. ప్రాణాన్ని నిలపండి, రక్తదానం ఒక గొప్ప సామాజిక బాధ్యత అని నవజీవన సహవాస సమాజం వర్షిప్ సెంటర్ పాస్టర్ జోయల్ అన్నారు. శుక్రవారం శనివారపుపేట ఎగ్జిబిషన్ గ్రౌండ్ సమీపంలో ప్రత్యేకంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి అధిక సంఖ్యలో రక్తదాతలు హాజరయ్యారు. రక్తదానాన్ని ప్రోత్సహించాలని, నిండు ప్రాణాలను నిలబెట్టాలని ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వాసుపత్రి రక్తనిధి వైద్య బృందం డాక్టర్ ఎస్.శశికళ, జి.జయలక్ష్మి, స్వప్న, చినబాబు, విజయబాబు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

ఏలూరుక్రైం,జూలై 4(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో కఠినమైన నిబద్ధతతో పాటు మానవీయ విలువలకు పెద్దపీట వేస్తూ మరోసారి ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో హోంగార్డుగా పనిచేస్తున్న పద్మ అనే మహిళ భర్త క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఘటనను తెలుసుకున్న ఆయన తన వంతుగా పది వేల రూపాయల ఆర్థిక సాయాన్ని శుక్రవారం హోంగార్డు పద్మకు అందించారు. ఆమె భర్త త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

ఏలూరు రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతిని శుక్రవారం స్థానిక న్యూఅశోకనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఘంటశాల స్వరపీఠం ఆధ్వర్యంలో జాతీయ పతాకం ప్రచారకర్త ఎస్ఎం.సుభాని సారథ్యంలో నిర్వహించారు. తొలుత పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవరకొండ వెంకటేశ్వర్లు, మేడికొండ పద్మజ, సౌజన్య, అనురాధ, బండారు సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చింతలపూడి, జూలై 4(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిణి కె.అనురాధ సూచించారు. శుక్రవారం యర్రగుంటపల్లి, ప్రగడవరం, యర్రంపల్లి గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం పనితీరును పరిశీలించారు. యర్రగుంటపల్లిలో మాజీ జడ్పీటీసీ టి.రాధారాణి, పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, సర్పంచ్ టి.రాణి, ఉపసర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి, ఎంపీటీసీ విజయభాస్కర్, గోలి శాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

బుట్టాయగూడెం, జూలై 4(ఆంధ్రజ్యోతి):కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ.భూషణం, జిల్లా ఉపాధ్యక్షుడు బన్నె వినోద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం దొరమామిడి, కొయిదా గ్రామాల్లోని పాఠశాలలను పరిశీలించి మాట్లాడారు. పాఠశాలల నిర్వహణ పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యార్థులకు సరిపడ డార్మిటరీలు, భోజనశాల, మరుగుదొడ్లు లేవన్నారు. నాణ్యమైన కూరగాయలు అందించాలని, సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఖాళీ ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలి

కుక్కునూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోసనును ఉభర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కె.లెనిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. నాయకులు వై.నాగేంద్రరావు, వై.సాయికిరణ్, వి.లక్ష్మణ్, గంజి వరుణ్, సత్యప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.


వేతనాలు ఇప్పించండి : ఏఐటీయూసీ నాయకులు

ఏలూరుకార్పొరేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థల్లో, పురపాలక సంఘాల్లో ఇంజనీరింగ్ విభాగంలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు ఇప్పించాలని కోరుతూ ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికి ఏఐటీయూసీ నాయకులు కోరారు. రెండు నెలలుగా వేతనాలు చెల్లించడంలేదని, కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఇప్పించాలని కోరారు. రెగ్యులర్ సిబ్బందికి బకాయిపడిన ఆరు డీఏలు చెల్లించాలన్నారు. నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ఉన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అప్పలరాజు, బి.నారాయణరావు, ఎస్.ఎం.వి.సుబ్బారావు, శ్రీనివాసరావు, సి.హెచ్.అప్పారావు, జి.రవి, కె.బాలకిషోర్ ఉన్నారు.

సొంత గూడు కరువాయె !

(5వ పేజీ తరువాయి)

మాత్రమే ప్రభుత్వ భవనం ఉండగా మండవల్లిలో వసతుల్లేని అద్దె భవనంలో సేవలను అందిస్తున్నారు. ముదినేపల్లి సబ్ రిజిస్ట్రార్ ఏర్పాటు చేసి 98 ఏళ్లు దాటింది. అప్పటి నుంచి అద్దె భవనాల్లో దీనిని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భవనంలో 40 ఏళ్ల నుంచి సేవలంది స్తున్నారు. వర్షాకాలం వస్తే ఆవరణ అంతా వర్షం నీరు నిండి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భవనం శిథిలావస్థకు చేరుకుంది. నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుకుగా ఉంది. చాలాకాలం నుంచి వేరే అద్దెభవనంలోకి మార్చాలని జిల్లా అధికారులు ఆదేశించినా మార్చకపోవడం విమర్శలకు తావిస్తోంది. 15 ఏళ్ల క్రితం ప్రభుత్వం స్థలం కేటాయించినా ఎవ్వరు పట్టించుకోకపోవడంతో అది మరుగున పడింది.



1959 నుంచి అద్దె భవనంలోనే జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



ఏలూరులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



గాలాయగూడెంలో రంగా విగ్రహానికి పూలమాల వేస్తున్న కాపు సంఘం నాయకులు



దిప్పకాయలపాడులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, తదితరులు

'రంగా ఆశయాలు నెరవేర్చుదాం'

వాడవాడలా వంగవీటి రంగా జయంతి వేడుకలు

ఏలూరు రూరల్/ఏలూరుటూటౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): పేదల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా ఆశయాలను నెరవేర్చుదాం అని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఏలూరు సీఆర్‌రెడ్డి కాలేజీ వద్ద ఉన్న రంగా విగ్రహానికి కాపు-బలిజ సంక్షేమ సేన జిల్లా అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నాగం శివ, కంది రంగబాబు, మహిళా జిల్లా అధ్యక్షురాలు సూదాబత్తుల శ్రీదేవి, కాపు నాయకులు పాల్గొన్నారు. జడ్పీ కార్యాలయం వద్ద రంగా కాంస్య విగ్రహం వద్ద ఎమ్మెల్యే బడేటి చంటి నివాళులర్పించారు. 78 కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి, పూజారి నిరంజన్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, గంటా ప్రసాద్ పాల్గొన్నారు.

● భీమడోలు: పట్టుదల, కార్యదీక్షకు వంగవీటి రంగా కొలమానమని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలు సంత మార్కెట్‌లోని రంగా విగ్రహానికి ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, జనసేన నాయకుడు పత్సమట్ల ధర్మరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ద్వారకాతిరుమల:పేదల ఆశాజ్యోతి వంగవీటి రంగా జయంతి వేడుకలను ద్వారకాతిరుమలలో జనసైనికులు నిర్వ హించారు. జనసేన నాయకుడు కె.అంజిబాబు, వీరమహిళ మనుబోలు అరుణకుమారి నేతృత్వంలో స్థానిక గరుడాళ్వార్ కూడలిలో ఉన్న రంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. టీడీపీ నేత ఇమ్మడి రత్నాజీ, బండారు శివాజీ, జనసైనికులు మణిబాబు, శివ, ప్రసాద్ రేవంతు రాజేష్, కల్యాణ్, రఘు, తేజ, బాలాజీ, శ్రీను, పాల్గొన్నారు.

● దెందులూరు : దెందులూరు మండలం గాలాయగూడెంలో దివంగత వంగవీటి రంగా జయంతి వేడుకలను రంగారాధ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాపు సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు పూజారి వెంకటరత్నం నాయుడు, పూజారి శ్రీనివాసరావు, సంఘ నాయకులు ఏనుగు రామకృష్ణ, తోట అశోక్ తదితరులు రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దోరేపల్లి రమేష్, పూజారి రాజశేఖర్,పెద్దిశెట్టి నాని, పూజారి సీతారామ్ పాల్గొన్నారు.

●చింతలపూడి/జంగారెడ్డిగూడెం:చింతలపూడి పాతబస్టాండ్‌లో రంగా విగ్రహం వద్ద జయంతి వేడుకలు విగ్రహ నిర్మాణ కమిటీ, అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గౌరవ అధ్యక్షులు కొత్తపూడి శేషగిరిరావు, అధ్యక్షుడు తోట శివనాగరాజు, కార్యదర్శి ముత్యాల చిన్ని, జనసేన నాయకులు టి.నాగవిజయకుమార్, చీదరాల మధుబాబు, రాఘవేంద్రరావు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఏలూరు రోడ్డులో వున్న రంగా విగ్రహం వద్ద జనసేన నాయకుడు బాదరాల నరేష్ ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ తదితరులు నివాళులర్పించారు.

● కొయ్యలగూడెం/పోలవరం: కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లోని వంగవీటి రంగా విగ్రహాల వద్ద, పరింపూడిలో ఉన్న విగ్రహం వద్ద, దిప్పకాయలపాడులో రంగా జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. పోలవరం మండలం నూతనగూడెంలో మోహన రంగా నూతన విగ్రహం వద్ద కూటమి నాయకులు నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచారు. అనంతరం బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు గునపర్తి చిన్ని, కొణతాల ప్రసాద్, కరిబండి నాగరాజు, పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న ఘంటా పద్మశ్రీ

'నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన భోజనం'

భీమడోలు, జూలై 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆరోగ్యకర మైన భోజన సౌకర్యానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుందని వాటిని సద్వినియోగపరిచేలా ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీలు చూడాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ సూచించారు. గుండుగొలను హైస్కూల్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు

ఉంగుటూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలంలో ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రాజమనోజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం, నీలాద్రిపురం గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ అనూష తదితరులు రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు.

'అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయాలి'

బుట్టాయగూడెం, జులై 4(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, అవసరాలు తదితర వాటిపై ప్రణాళికలు సిద్ధం చేసి ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం కేఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయంలో వికసిత్ స్వర్ణాంధ్ర విజన్-2047పై ఏడు మండలాల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉపాధి అవసరాలను మెరుగుపరచే అంశాలను పొందుపర్చాలని, పంటల సమస్యలు, సైన్సు ల్యాబ్‌లు ఏర్పాటు చేసి రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చేలా శిక్షణలు ఇవ్వాలన్నారు. రైతులకు సోలార్ బోర్లను అందించాలని తెలిపారు. పీవో కె.రాములునాయక్, అధికారులు పాల్గొన్నారు.

'పారిశ్రామికవేత్తలుగా విద్యార్థులు ఎదగాలి'

ఏలూరు అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ప్రిన్సిపాల్ గిరిబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ పేరిట అవగాహన కార్యక్రమాన్ని విద్యార్థులకు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగటానికి, దేశానికి ఆర్థిక చేయూత నివ్వడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వెంకట్రావు, వైస్‌ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, ఎల్.వెంకటేశ్వరరావు, రాంబాబు, పద్మావతి పాల్గొన్నారు.

గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలి

లింగపాలెం, జూలై4(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కె.వాణి సూచించారు. శుక్రవారం లింగపాలెంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలలో చెత్త, మురుగునీరు నిలువ లేకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో శానిటేషన్ పనులను చేపట్టాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో సుందరి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల అందజేత

నిడమర్రు, జూలై 4(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ పూర్వ డిస్ట్రిక్ గవర్నర్ పంకజాక్షన్ జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గణపవరం వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సుమారు 40 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, బిస్కెట్ ప్యాకెట్లు, శానిటైజర్ బాటిల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి నరేష్‌కుమార్, కార్యదర్శి కిలారి రవిబాబు, కోశాధికారి సత్యనారాయణమూర్తి, రావూరి నాగరాజు, కాకర్ల వినాయక్, కూనసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.







ఏలూరు, పెదపాడు, పోలవరం గ్రామాల్లో ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్.. ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బడేటి చంటి
- జిల్లా వ్యాప్తంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాలు

ఏలూరుటూటౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన పేదలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శుక్రవారం ఏలూరు 49వ డివిజన్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఏడాది కాలంలో ప్రభుత్వం అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలు ప్రజలకు అందించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుని, ప్రాధాన్యతక్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి కూటమి నేతలు పాల్గొన్నారు.

● పెదపాడు/పెదవేగి: పెదపాడు మండలం పెదపాడు, రామచంద్రపురం, గండిచెరువుగట్టు, పాతపెదపాడు, రాజుపేట, నాయుడుగూడెం గ్రామాల్లో 'సుపరిపాలనలో ప్రభుత్వం తొలి అడుగు'లో భాగంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఇంటింటికి పాదయాత్ర నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, మోరు శ్రావణి, గుత్తా అనిల్, ఉప్పలపాటి రాంప్రసాద్, బొప్పుడి కాశీబాబు, మరడాని రవి, అక్కినేని వంశీకృష్ణ, లావేటి శ్రీనివాసరావు, కె.అప్పారావు పాల్గొన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురంలో గ్రామ సర్పంచ్ మేకా కనకరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. మాజీసర్పంచ్ మేకా రంగారావు, పార్టీ నాయకులు పూజారి రాంబాబు, బొర్రా రాము, శ్రీనివాసరావు, నారాయణ, రఘు తదితరులు పాల్గొన్నారు.

●జంగారెడ్డిగూడెం/లింగపాలెం:రాష్ట్ర ప్రజల సంక్షేమాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి ఉందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ అన్నారు. జంగారెడ్డిగూడెంలోని ఒకటో వార్డులో సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు అల్లూరి రామకృష్ణ, అల్లూరి శేఖర్, పాలూరి లక్ష్మణరావు, చిత్తపూరి దుర్గేష్, జంగా ప్రసాద రెడ్డి, గెడా సుబ్రహ్మణ్యం, పాకనాటి కాశీ, తెలగారపు సాయి తదితరులు పాల్గొన్నారు. లింగపాలెం మండలంలో టీడీపీ మండల అధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. తాతిన రాధాకృష్ణ, పల్లిశ్రీను, తాడేపల్లి దాస్‌బాబు, పొదిల రాజు, యాదాల అశోక్, సాయికృష్ణ, అజయ్, శౌరి తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం/కొయ్యలగూడెం : పోలవరంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, కూటమి నాయకులతో కలిసి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గడప గడపకూ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ సీనియర్ నేత కుంచే దొరబాబు, మంగిన కొండ, పాదం ప్రసాద్, పోతుల శ్రీను, పిల్లి నాగరాజు, రెల్లి కొండబాబు, ఆకుల రాజా, నల్లా రాంబాబు, యడ్ల వినోద్, జల్లేపల్లి వెంకట నరసింహారావు, బెజవాడ గోపి తదితరులు పాల్గొన్నారు. కొయ్యలగూడెం మండలం రాజవరం పంచాయతీలో టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేశ్ ఆధ్వర్యంలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని సమస్యలను తెలుసుకున్నారు. రాజవరం మాజీ సర్పంచ్ వాడపల్లి రాధాకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు సూదగాని సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బర చినరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి రమాదేవి, కాకర్లమూడి రాజేశ్వరరావు, మహేశ్ పాల్గొన్నారు.

●కుక్కునూరు/వేలేరుపాడు : కుక్కునూరు మండలంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, నియోజకవర్గ అబ్జర్వర్ అనపర్తి వెంకటనారాయణ, కోటగిరి సత్యనారాయణ, బొల్లు కృష్ణ, వెంకటరమణ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, వెంకన్నబాబు, బీజేపీ నాయకులు లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు. వేలేరుపాడు మండలం రుద్రమ్మకోటలో కూటమి నాయకులు ఇంటింటికి తిరుగుతూ ఏడాది పాలనలో జరిగిన సంక్షేమాన్ని వివరించారు. టీడీపీ మండల అధ్య క్షుడు అమరవరపు అశోక్, ఐటీడీపీ ఏలూరు పార్లమెంట్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్, జనసేన నాయకులు కె.క్రాంతికుమార్, నాయకులు పాల్గొన్నారు.





ఏలూరులో అల్లూరికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ కిశోర్

ఘనంగా 'అల్లూరి' జయంతి వేడుకలు

ఏలూరు క్రైం/ఏలూరు/ ఏలూరుటూటౌన్/ ఏలూరు కార్పొరేషన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి పురస్కరించుకుని శుక్రవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్, అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఏలూరు పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఏలూరు పవర్‌పేటలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

పెదవేగి/జంగారెడ్డిగూడెం/చింతలపూడి/నిడమర్రు/కుక్కునూరు/టి.నరసాపురం/జీలుగుమిల్లి/పోలవరం: పెదవేగిలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో, జంగారెడ్డిగూడెంలో అప్‌ల్యాండ్ క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్కులో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు ఆధ్వర్యంలో, చింతలపూడి మండలంలోని చింతలపూడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రి ఆవరణలో అల్లూరి విగ్రహానికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. నిడమర్రు మండలం ఫత్తేపురం గ్రామంలో స్థానిక పెద్దలు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్షత్రియ సేవాసమితి సభ్యులు యుగంధర్ పాల్గొన్నారు. కుక్కునూరు మండలం కుక్కునూరులో సీపీఎం నాయకులు వై.నాగేంద్రరావు, మహబూబ్ బాషా, వైసీపీ నాయకురాలు నాగుల మీర ఆధ్వర్యంలో, టి.నరసాపురం మండలం టి.నరసాపురం ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి సభ్యులు పి.రామకృష్ణ, గుడెల్లి వెంకట్రావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో హెచ్ఎం ఎంవీఎస్.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. పోలవరం మండలం పోలవరంలో పంచాయతీ కార్యాలయం వెలుపల ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఈ ఏడాది ఏ ఒక్క పార్టీ నాయకులు కార్యకర్తలు విగ్రహం వైపు కన్నెత్తికూడా చూడలేదు. ఆ ప్రాంతంలో పొదలనైనా తొలగించకపోవడం విచారకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ నిలుపుదల

నిడమర్రు,జూలై 4(ఆంధ్రజ్యోతి): నిడమర్రు సెక్షన్ పరిధిలోని పలు గ్రామాలకు శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఈఈ ఎం. అంబేద్కర్ తెలిపారు. నిడమర్రు, గుణపర్రు, విపర్తిఖండ్రిక, పెదనింద్రకొలను, చిననింద్రకొ లను, తోకలపల్లి, బైనేపల్లి, దేవర గోపవరం, అడవికొలను ఇందిరమ్మ కాలనీ వాసులకు సహకరించాలన్నారు.

● టి.నరసాపురం:ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున టి.నరసాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గండిగూడెం, ముత్యాలమ్మపేట, బండివారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని సీతంపేట, గంగినీడుపాలెం, మర్రిగూడెం, సబ్‌స్టేషన్ పరిధిని గ్రామాలు, రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని కేతవరం గ్రామాల్లో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు కరెంట్ సరఫరా ఉండదని డీఈ శ్రీధర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.ఆయా రోజుల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు.

లింగపాలెంలో వాహనాల తనిఖీ

లింగపాలెం, జూలై 4(ఆంధ్రజ్యోతి): లింగపాలెంలో శుక్రవారం ఎస్ఐ కె.వెంకన్న వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు చేశారు. ద్విచక్రవాహనదారులు, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.



కొయ్యలగూడెం, కన్నాపురం రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

ఆక్రమణల తొలగింపు

కొయ్యలగూడెం, జూలై 4(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం నుంచి కన్నాపురం వెళ్లే రహదారిలో ఆక్రమణలు తొలగించారు. శుక్రవారం తహసీల్దార్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సురేశ్, సిబ్బంది కలిసి ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించు కోవాలని కోరడంతో షాపు యాజమానులే డ్రైయినేజీపై ఉన్న రేకు షెడ్లను తొలగించారు. ఈ ఆక్రమణలు తొలగించాలని గతంలో ఏఆర్‌కే హనుమంతరావు ఫిర్యాదు చేసిన సంగతి విదితమే.. ఈమేరకు అధికారులు శుక్రవారం ఆక్రమణలను తొలగించారు.

కామవరపుకోటలో ఘర్షణ

కామవరపుకోట, జూలై 4(ఆంధ్రజ్యోతి): కామవరపుకోటలోని వీరభద్రస్వామి ఆలయానికి చెందిన కల్యాణ మండపం సమీపంలో గల ఇరు కుటుంబాలు రెండు రోజులుగా ఘర్షణకు పాల్పడుతున్నారు. శుక్రవారం ఉద్రిక్తత పెరిగింది. సమాచారం అందుకున్న జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర ఆధ్వర్యంలో పోలీసు బృందం సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఇరువర్గాలకు హెచ్చరించారు. అనంతరం కొద్దిసేపటికి పరిస్థితి అదుపులోకి వచ్చింది.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నూజివీడు టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నూజివీడు ఆర్టీసీ బస్ డిపో వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. పాత విధానంలోనే వైద్య సదుపాయాలు కల్పించాలని, పదోన్నతులను పూర్తి చేయాలని, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ డిపో కార్యదర్శి కుమార్, రీజనల్ మెంబర్లు రంగు శ్రీను, గంగాధరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ మొబిన్, బి. నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ హామీతో దీక్ష విరమణ

మండవల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి):ఇళ్లస్థలాల లబ్ధిదారులకు వారం రోజుల్లో పట్టాలు పంపిణీ చేస్తామని తహసీల్దార్ గోపాల్ అన్నారు. మండవల్లి మండలం తరుగుమూలకు చెందిన ఇళ్ల స్థలాల లబ్ధిదారులు 12 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న విషయం విదితమే. శుక్రవారం తహసీల్దార్ గోపాల్ వారితో చర్చించారు. అర్హులకు పట్టాలు ఇవ్వడమే గాక ప్రభుత్వం నుంచి ఇళ్ల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేస్తామని, దీక్షను విరమించాలని కోరడంతో తహసీల్దార్ హామీ మేరకు వారు దీక్షలను విరమించారు.

ఒంగోలు ట్రిపుల్ ఐటీలో కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి):నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోగల ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అడ్మిషన్లకు కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభించారు. తొలి రోజు మొత్తం 505 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపగా 475 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. 430 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వీరిలో బాలురు 128 మంది, బాలికలు 302 మంది ఉన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమంలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్. అమరేంద్రకుమార్, ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ భాస్కర్ పటేల్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ రూపేష్ కుమార్, పరిపాలన అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం-అరుణాచలం మధ్య ప్రత్యేక రైలు

నరసాపురం, జూలై 4(ఆంధ్రజ్యోతి):నరసాపురం - అరుణాచలం(తిరువణ్ణామలై) మధ్య ప్రతి బుధవారం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు స్టేషన్ మేనేజర్ మధుబాబు శుక్రవారం చెప్పారు. 07219 నెంబరుతో ఈ రైలు ప్రతి బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు నరసాపురంలో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 5 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. గురువారం మధ్యాహ్నం 11 గంటలకు అక్కడ బయ లుదేరి మరుసటి రోజు తెల్లవారుజాము 3 గంటలకు నరసాపురం వస్తుంద న్నారు. ఆగస్టు నెలాఖరు వరకు పాలకొల్లు, భీమవరం జంక్షన్, టౌన్, ఆకివీడు, ఒంగోలు, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, వెల్లూరు మీదుగా నడుస్తుం దన్నారు. రాష్ట్రం నుంచి నేరుగా అరుణాచలం వెళ్లే తొలి రైలు ఇదే కావడం గమనార్హం. ప్రస్తుతం అరుణాచలం వెళ్లాలంటే తిరుపతి, కాట్పాడి నుంచి రోడ్డు మార్గంలో వెళ్లాల్సి ఉంది. విజయవాడ నుంచి వారానికి నేరుగా ఒక్క రైలు మాత్రమే అరుణాచలం మీదుగా నడుస్తోంది. ఇది ఢిల్లీ నుంచి వస్తుండడంతో రిజర్వేషన్ దొరకని పరిస్థితి. ఉభయ గోదావరి జిల్లావాసులు చాలా కాలం నుంచి అరుణాచలం రైలు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నేతలు, ప్రయాణికుల వినతి మేరకు రైలు వేయడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో వైద్యం అందక చూడి గేదె మృతి..

ముసునూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి):ముసునూరులో అనారోగ్యానికి గురైన చూడి గేదె శుక్రవారం మృతి చెందింది. బీసీ కాలనీకి చెందిన రైతు మానికల రాంబాబు చూడిగేదెకు వారం క్రితం విష జ్వరం రావడంతో ముసునూరు పశు వైద్యశాలకు వెళితే ఇన్‌చార్జ్ వైద్యుడు అందుబాటులో లేరని, సిబ్బంది అరకొరగా వైద్యం చేశారని రైతు ఆరోపించాడు. దీంతో సరైన వైద్యం అందక సుమారు లక్ష రూపాయల విలువ గల గేదె చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. కాట్రేనిపాడు పశువైద్యుడు ఇక్కడ ఇన్‌చార్జ్‌గా ఉన్నారని, ఆయ న కనీసం వారానికి ఒకరోజు కూడా రావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పశువైద్యశాలకు పర్మినెంట్ వైద్యుడ్ని నియమించాలని రైతులు కోరుతున్నారు.

కుక్కకాటు బాధితులకు మెరుగైన వైద్యం

చాట్రాయి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఆరుగురిని గాయపర్చిన ఘటనపై అధికారులు స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తామని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైద్య సిబ్బంది బాధితుల ఇళ్లకు వెళ్ళి వైద్య సేవలు అందిస్తున్నారని తక్షణం స్పందించిన వైద్యాధికారులకు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి తేళ్ళూరి శేఖర్ ధన్యవాదాలు తెపాఆరు. గ్రామంలో కుక్కలను పట్టించి దూర ప్రాంతాలలో అడవులకు తరలిస్తామని పంచాయతీ కార్యదర్శి ఎంవీఎస్ నాగరాజు అన్నారు.

ఆగిరిపల్లి మండల టీడీపీ కమిటీ ఎంపిక

ఆగిరిపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లి టీడీపీ మండల అధ్యక్షుడిగా శోభనాపురం గ్రామానికి చెందిన నక్కనబోయిన వేణు ఎంపికయ్యారని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్, మండల పరిశీలకులు సీహెచ్ రామలింగేశ్వర రావు తెలిపారు. ఉపాధ్యక్షులుగా ఆరేపల్లి శివయ్య, ప్రధాన కార్యదర్శిగా కొల్లిపర సాంబశివరావు, కోశాధికారిగా యండూరి ప్రణీత్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కోసూరి సుబ్బరాజు, లోకం సత్యనారాయణ, బోనం శ్రీనివాసరావు, కార్యదర్శులుగా షేక్ జాన్ బాషా, గుంప గోపి, నల్లమోతు బుల్లిబాబు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

నూజివీడు టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి):సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నెహ్రూపేటలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమానికి ఆకర్షితులై దాదాపు 20 మంది కార్యకర్తలు మంత్రి కొలుసు పార్థసారథి సమక్షంలో టీడీపీలో చేరారు. ఇళయ రాజా రమేష్, జగదీష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువుల్ని యుద్ధప్రాతిపదికన నింపాలి

కైకలూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): కైకలూరు పంటకాలువలో నీరు విడుదల చేసినందున మంచినీటి చెరువులను యుద్ధప్రాతిపదికన నింపాలని ఎంపీడీవో ఆర్. ఫణీంద్ర, డీసీ ఛైర్మన్ పొత్తూరి వాసురాజు అన్నారు. శుక్రవారం కైకలూరులోని భవానమ్మ చెరువును, షాదీఖానా వద్ద కైకలూరు పంట కాలువను వారు పరిశీలించి మాట్లాడారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

కైకలూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి):బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీవో ఆర్. ఫణీంద్ర అన్నారు. శుక్రవారం కైకలూరు ఎంఈవో కార్యాలయంలో జడ్పీ హైస్కూళ్ళ హెచ్‌ఎంలతో సమావేశాన్ని నిర్వహించారు. అలాగే ఈ నెల 10న ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విద్యార్థుల తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి తల్లిదండ్రులు పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. ఎంఈవోలు రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్ : మంత్రి సారథి

ఆగిరిపల్లి/నూజివీడు, జూలై 4(ఆంధ్రజ్యోతి):పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని మంత్రి పార్థసారథి అన్నారు. చిన్న ఆగిరిపల్లి గ్రామానికి చెందిన అనూషకు సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షల ఎల్‌ఓసీని మంత్రి అందజేశారు. అనూష కుటుంబీకులు తమ ఆర్థిక పరిస్థితి బాగోలేదని మంత్రి దృష్టికి తేగా ఆయన స్పందించి సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించడంతో వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని 9న సమ్మె

నూజివీడు టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి):లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, స్కీం వర్కర్లు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని శుక్రవారం నూజివీడు పెద్ద గాంధీ బొమ్మ సెంటర్లో కరపత్రాలు విడుదల చేశారు.


సొంత గూడు కరువాయె!

(5వ పేజీ తరువాయి)



మాత్రమే ప్రభుత్వ భవనం ఉండగా మండవల్లిలో వసతుల్లేని అద్దె భవనంలో సేవలను అందిస్తున్నారు. ముదినేపల్లి సబ్ రిజిస్ట్రార్ ఏర్పాటు చేసి 98 ఏళ్లు దాటింది. అప్పటి నుంచి అద్దె భవనాల్లో దీనిని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భవనంలో 40 ఏళ్ల నుంచి సేవలంది స్తున్నారు. వర్షాకాలం వస్తే ఆవరణ అంతా వర్షం నీరు నిండి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భవనం శిథిలావస్థకు చేరుకుంది. నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుగ్గా ఉంది. చాలా కాలం నుంచి వేరే అద్దె భవనంలోకి మార్చాలని జిల్లా అధికారులు ఆదేశించినా మార్చక పోవడం విమర్శలకు తావిస్తోంది. 15 ఏళ్ల క్రితం ప్రభుత్వం స్థలం కేటాయించినా ఎవ్వరు పట్టించుకోక పోవడంతో అది మరుగున పడింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి ఫలాలు

'సుపరిపాలనలో తొలి అడుగు'లో మంత్రి కొలుసు పార్థసారథి



వేల్పుచర్లలో మంత్రి పార్థసారథికి స్వాగతం పలుకుతున్న మహిళలు, నాయకులు



నూజివీడు మండలం దేవరగుంటలో మాట్లాడుతున్న ముద్దరబోయిన



కలిదిండిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ముసునూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి):ప్రతి ఇంటికి, ప్రతి ఊరికి సంక్షేమం, అభివృద్ధి ఫలాలు చేరాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేల్పుచర్ల, బలివే గ్రామాల్లో అధికారులు, కూటమి నాయకులతో కలిసి మంత్రి ప్రజలకు అందుతున్న పథకాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి కరపత్రాలను అందజేసి, పోస్టర్లను గోడలకు ఆయనే స్వయంగా అతికించారు. ప్రతి ఒక్కరూ పథకాల ద్వారా తమకు లబ్ధి చేకూరిందని, ఈ ప్రభుత్వంలో తమ బతుకులు మారాయని ప్రజలు చెప్పడంతో మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తే నేడు పాలనా దక్షత గల ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక వ్యవస్థను చక్కబెడుతూ సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను ఏడాది కాలంలోనే 75 శాతం అమలు చేశామని, రానున్న రెండు మూడు నెలల్లో నూరుశాతం పథకాల అమలుకు ప్రణాళికలు సిద్ధమయ్యామని అన్నారు. పారిశ్రామికవేత్తలు తరలివస్తున్నారని, రూ.6.50 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని, రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. తొలుత మంత్రికి మహిళలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. గొర్రెల కాపరులు గొర్రెపిల్లను మంత్రికి బహుమతిగా అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, నియోజకవర్గ పరిశీలకులు వేములకొండ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచ్‌లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు: సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకువెళుతున్న సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. దేవరగుంటలో నిర్వహించిన సుపరిపాలన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం మూడు దశాబ్దాలు వెనక్కి వెళ్ళిపోగా, ఇటు సంక్షేమాన్ని అటు అభివృద్ధిని సీఎం సమానంగా ముందుకు తీసుకువెళుతున్నారు. గత ప్రభుత్వం సంవత్సరానికి 250 రూపాయిలు మించి పింఛన్ పెంచలేకపోయిందని కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక సామాజిక పింఛన్‌లు నాలుగు వేలకు పెంచి కుటుంబానికి పెద్ద కొడుకుగా నిలిచారన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని టీడీపీ ఆగిరిపల్లి గ్రామ అధ్యక్షుడు పాముర్తి నరసయ్య అన్నారు. ఆగిరిపల్లిలో శుక్రవారం ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. మడువల్లి గోపాల్, మాదల సత్యకుమార్, చౌటపల్లి విక్టర్‌బాబు, శ్రావణ్‌కుమార్, షేక్‌చాన్‌భాషా, బోనం శ్రీనివాసరావు పాల్గొన్నారు. బొద్దనపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీసీ ఛైర్మన్ ఉప్పు వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సుఖ జీవనం అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి మందలపు జగదీశ్, మండల టీడీపీ నాయకుడు మాదాసు చిన్న పుల్లయ్య అన్నారు. చీపురుగూడెం, జనార్ధనవరం గ్రామాలలో శుక్రవారం ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ ఓబిళ్ళనేని నరశింహారావు, బలుపూరి రత్తయ్య, లింగారెడ్డి వెంకటేశ్వరరావు, చెన్నారావు, రవి, పులపాక రఘు, నడిపింటి వెంకటేశ్వరరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు నియోజకవర్గంలో..

కైకలూరు: సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తూ పారదర్శకమైన పాలనను కూటమి ప్రభుత్వం అందిస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. శుక్రవారం కైకలూరు 115, 120వ బూత్‌లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పడమటి వాసు, మాజీ అధ్యక్షుడు ఎండీ జానీ, బూత్ ఇన్‌చార్జి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు మెంటే పార్థసారథి, నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. శుక్రవారం కలిదిండి 1వ వార్డులో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, గ్రామ టీడీపీ అధ్యక్షులు అస్లాం పాల్గొన్నారు.

ముదినేపల్లి: పెదపాలపర్రు, చినపాలపర్రు గ్రామాల్లో శుక్రవారం టీడీపీ నాయకులు సు పరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి ఆధ్వర్యంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, సర్పంచ్ గంటా రాకేష్‌కుమార్, పెదపాలపర్రు గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు సంకు రాత్రి మాధవరావు, పల్లపోతు ప్రసాద్, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు రౌతు మాధవి పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.

మండవల్లి: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం భైరవపట్నంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాలనను వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ పథకాలు అందజేస్తోందన్నారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు బొల్లింపల్లి కృష్ణారావు, టీడీపీ నాయకులు సజ్జా సురేష్‌బాబు, చదలవాడ శ్రీమన్నారాయణ, కూనపురెడ్డి కోటేశ్వరరావు, గుడివాడ గణేషు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి):విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపునకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వరహాపట్నం సబ్‌స్టేషన్ పరిధిలోని సీతనపల్లి, దొడ్డిపట్ల, రామవరం గ్రామాల్లో సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముదినేపల్లి: ముదినేపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నవరం ఫీడర్‌కు సంబంధించిన గురజ, పెనుమల్లి, అన్నవరం, దేవరం, వడాలి, కోమర్రు, చేవూరు గ్రామాల్లో వైర్లను తాకే చెట్ల కొమ్మల తొలగింపు పనులు నిర్వహి స్తున్నందున ఆయా గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తామని, వినియోగదార్లు గమనించి సహకరించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

ముసునూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి):మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీఏ సత్యనారాయణ తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు సకాలంలో పాల్గొనాలని ఆయన కోరారు. అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఎంపీడీవో తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ఆగిరిపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి):బీజేపీ ఆగిరిపల్లి మండల సమావేశం ఆ పార్టీ నూజివీడు కన్వీనర్ జీఆర్‌కె రంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి చేరేలా ప్రచారం నిర్వహించాలని అన్నారు. పార్టీ బలోపేతానికి మండల నాయకులు, బూత్ కమిటీ అధ్యక్షులు కృషిచేయాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి మాగంటి వాసు తదితరులు పాల్గొన్నారు.

పీటీఎం కమిటీల ఏర్పాటు

ఆగిరిపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లి హైస్కూల్లో తహసీల్దార్ వీఎస్వీ ప్రసాద్ ముఖ్య అతిథిగా, ఎంఈవో ఆనంద్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం మెగా పీటీఎం 2.0 సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ 10న మెగా పీటీఎం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

విజేతలకు అభినందన

అనంతరం బెంగుళూరులో హెచ్‌సిఎల్ నిర్వహించిన సౌత్‌జోన్ కబడ్డీ పోటీలు అండర్-15 విభాగంలో ఆగిరిపల్లి స్కూల్ విద్యార్థులు ముగ్గురు పాల్గొని, విజేతలుగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. క్రీడాకారులు ప్రహర్ష, రోహిత్, అభిలాష్‌లను తహసీల్దార్ అభినందించారు.

'మీ గమ్యం.. మీ చేతుల్లోనే' పంపిణీ

ముసునూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి):ముసునూరు గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలికలకు పాఠశాల పూర్వ విద్యార్థి చలసాని శాంతి స్వయంగా రూపొందించిన మీ గమ్యం మీ చేతుల్లోనే పుస్తకాలను శుక్రవారం వితరణ అందజేశారు. పూర్వ విద్యార్థి, ప్రస్తుతం పునాదిపాడులో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న శాంతి తన తల్లిదండ్రుల పేరిట బాలికలకు పుస్తకాలను అందజేశారు. విద్యార్థులకు వారి భవిష్యత్ పట్ల ఆలోచన కలిగించే విధంగా వారి మంచి నడవడికను పెంపొందించుకునేలా ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకుమారి తెలిపారు. పాఠశాల అభివృద్ధితోపాటు విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తానని శాంతి చెప్పారు.

టీడీపీ కార్యకర్త కల్పన మృతికి సంతాపం

ముదినేపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి):చిగురుకోట గ్రామానికి చెందిన టీడీపీ క్రియాశీల కార్యకర్త, తెలుగు మహిళా నాయకురాలు లింగంపల్లి కల్పన (35) మరణించారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మరణించారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ కల్పన భౌతిక కాయంపై టీడీపీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, తెలుగు మహిళ ఏలూరు జిల్లా కార్యదర్శి కందేపి పద్మ గ్రామ పార్టీ నాయకులు ఆమెకు నివాళులర్పించారు.

పేదలకు భూములను పంచాలి

ఆగిరిపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని ప్రభుత్వ భూములను రెవెన్యూశాఖ అధికారులు స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలందరికీ పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆగిరిపల్లి మండలం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆగిరిపల్లి భూపోరాట కమిటీ సమావేశం అర్జున్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. భూమిలేని పేదలకు భూమి పంచే వరకు పెద్దఎత్తున ఉద్యమి స్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

చేపల పట్టుబడికి వెళ్లి యువకుడి మృతి

ముదినేపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి):ముదినేపల్లి మండలం పెదగొన్నూరు గ్రామానికి చెందిన అవ్వారు హేమంతరావు (30) ప్రతి రోజూ తాపీ పనులకు వెళ్తుంటాడు. ఈ నెల 1న తాపీ పని లేకపోవటంతో చేపల పట్టుబడి పనులకు వెళ్లగా, అదే చెరువులో మునిగి పోయాడు. వెంటనే అతనిని పెదఅవుటపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

రోశయ్య, స్వామి వివేకానందకు ఘన నివాళి



కైకలూరులో రోశయ్య చిత్రపటం వద్ద నివాళి

కైకలూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య సేవలు అభినందనీయమని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి అన్నారు. శుక్రవారం కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా కైకలూరులో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఎండీ జానీ, మాజీ ఎంపీటీసీ రాధాకృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పడమటి వాసు, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు కె.కొండలు, చొప్పల మురళీకృష్ణ, పొన్నూరు వీరయ్య, ఎల్.మోహన్, వినయ్, కొల్లూరి కాశీ, తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

కలిదిండి: కలిదిండిలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొణిజేటి రోశయ్య, అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కలిదిండి మానవత సేవా సంస్థ అధ్యక్షుడు నూకల శ్యామల రావు గుప్తా, జిల్లా అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పూర శ్రీధర్, ఎంపీటీసీ నీలి సుమన్, ఆర్యవైశ్య సంఘ నాయకులు నీలి వెంకటేశ్వరరావు, చక్కా జగన్, పలివెల ప్రకాశరావు, పూర ప్రవీణ్, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: భారతీయ తత్వవేత్త, రామకృష్ణ మిషన్ వ్యవస్థాపకుడు స్వామి వివేకానంద బోధనలను ప్రభుత్వాలు విద్యార్థులకు పాఠ్యాం శాలుగా రూపొందించాలని బీజేపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు వెంకట కృష్ణారావు అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్తు కార్యాలయం వద్ద వివేకానందుడి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ వివేకానందుడి ఆశయాలు నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మండల బీజేపీ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యుడు వత్తుమిల్లి ప్రసాద్, నాయకులు వీరబాబు, కొల్లి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం



భుజబలపట్నంలో క్షత్రియ సంఘం నివాళులు



రాజానగరంలో అల్లూరికి నివాళులు

కైకలూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): అల్లూరి స్వాతంత్ర్య పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని భుజబలపట్నం క్షత్రియ సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం భుజబలపట్నంలో అల్లూరి విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దండు రాము 200 మంది విద్యార్థులకు భోజన క్యారేజీలను పంపిణీ చేశారు. క్షత్రియ సంఘం, యూత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: రాజానగరంలో అల్లూరి విగ్రహానికి క్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు సాగి కొండ రాజు, సాగిరాజు సూర్యనారాయణరాజు, సాగి సుబ్బరాజు, రవిరాజు, వాసురాజు, అల్లూరి యువసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మన్యం వీరుడికి మంత్రి నివాళి

నూజివీడు టౌన్: నూజివీడులోని క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్రిటిష్ పాలకులపై ఆయన పోరాటాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. మహనీయుల బాట సర్వత్రా అనుసరణీయమని ఎమ్మార్ అప్పారావు కాలేజ్ ఫర్ పీజీ స్టడీస్ ప్రిన్సిపాల్ జె. లావణ్య లత అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద వర్ధంతి, అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా కళాశాలలో వారి చిత్రపటాలకు ప్రిన్సిపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రంగాకు ఘన నివాళి

ముదినేపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా జయంతి సందర్భంగా ముదినేపల్లిలో గురజ రోడ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గంటా సంధ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు శీలం రామకృష్ణ, ముదినేపల్లి సంఘ రాష్ట్ర కార్యదర్శి కోమటి విష్ణువర్ధన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల టీడీపీ, జనసేన నాయకులు రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కైకలూరు: వంగవీటి మోహన రంగాను స్ఫూర్తిగా తీసుకుని యువత సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. కైకలూరులోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం కైకలూరు వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ ఆర్థిక సహకారంతో 400 మంది పేదలకు అన్నదానం చేశారు. సాయంత్రం యువత పెద్దఎత్తున కైకలూరు పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, వార్డు సభ్యుడు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: చాట్రాయిలో కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రంగా జయంతిని నిర్వహించారు. కాపు సంఘం నాయకులు కమ్ముల కొండల రావు, శ్రీరాముల సత్యనారాయణ, గాజుల ప్రశాంత్, శ్రీకాంత్, నవరం రామారావు, పసుపులేటి మహేష్, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో రంగా విగ్రహం వద్ద నివాళి

కలిదిండి: కోరుకొల్లులో రాధా - రంగా మిత్ర మండలి, కూటమి నాయకులు వంగవీటి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలిదిండిలో జనసేన నాయకులు రంగా అభిమానులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు, కొల్లి బాబీ, తోట ఆంజనేయులు, ఆముజాల బాబులు, వలవల చిరంజీవి, మేకా శివ కేశిరెడ్డి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: పేదల అభ్యున్నతి కోసం ప్రజా పోరాటాలు చేసిన వంగవీటి రంగాను ఆదర్శంగా తీసుకుని నేటి యువత పనిచేయాలని కాపు సంఘం నాయకులు కోనేరు సాయికృష్ణ, కోనేరు విజయ భాస్కర్ అన్నారు. శుక్రవారం ముసునూరు రావిచెట్టు సెంటర్‌లో రంగా 78వ జయంతి వేడుకలను కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. మకరం నాగబాబు, మంగిశెట్టి సుబ్బారావు, కొల్లి పోతురాజు, నందేటి సతీష్‌కుమార్, కోనేరు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ సొత్తు, నగదు బాధితులకు అందించిన ఎస్పీ

ఏలూరు క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి):కైకలూరు రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధి లోని వివిధ దొంగతనాల కేసుల్లో రికవరీ చేసిన బంగారు ఆభరణాల నగదును ఎస్పీ కిశోర్ స్వయంగా బాధితులకు అందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం బాధితులకు వస్తువులను అందించడంతో వారంతా పోలీ సులకు కృతజ్ఞతలు తెలిపి నమస్కరించారు. పోయిన వస్తువులు తమకు వస్తాయో లేదోనని ఎంతో బాధతో ఉన్నామని, పోయిన ప్రతి వస్తు వు అందించడంతో కలో నిజమో తెలియడం లేదనే పరిస్థితుల్లో ఆనందంగా ఉన్నామంటూ బాధితులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ద్వారా ఆన్‌లైన్ పెట్టుబడులు పెట్టి పోగొట్టుకున్న సొమ్మును కూడా సైబర్ సెల్ ద్వారా రికవరీ చేసి ఆ సొమ్ములను కూడా బాధితులకు అందించారు. ఏఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ దాసు, అధికారులు పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధులే లక్ష్యంగా..

దోపిడీకి పాల్పడే ముఠాను అరెస్టు చేసిన కైకలూరు రూరల్ పోలీసులు

ఏలూరు క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి):ఒంటరిగా ఉన్న వృద్ధులే ఆ ముఠాకు టార్గెట్. దాడులకు తెగబడి బంగారాన్ని అపహరించే ముఠాను కైకలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ముఠా వివరాలను వెల్లడించారు. కైకలూరు రూరల్ మండలం రాయవరంలో మే 28న ఒంటరిగా ఉంటున్న గూడూరి నాగలక్ష్మి (62) వద్దకు ఇద్దరు యువకులు వెళ్లి ఆమె తల ను గోడకేసి కొట్టి గాయపరిచారు. స్పృహ తప్పి న ఆమె మెడలో బంగారు చైన్, గాజులు అపహరించుకుపోయారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. నేరాలకు పాల్పడిన అదే గ్రామానికి చెందిన పంతగాని జాన్‌కుమార్, గరికముక్కు రాజ్ కుమార్‌ను అరెస్టు చేసి వారి నుంచి చోరీకి గురైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

రాయవరం గ్రామానికి చెందిన సోము సీతా మహాలక్ష్మి (65) కిరాణా కొట్టు నిర్వహిస్తుం ది. 2024 ఫిబ్రవరి 13న నలుగురు దొంగలు ఆమెపై దాడి చేసి రెండు బంగారు గాజులు అపహరిం చుకుపోయారు. అదే గ్రామానికి చెం దిన భూపతి ప్రదీప్ అలియాస్ జన్ను, కురేశ సుబ్బారావు అలియాస్ సుబ్బును అరెస్టు చేసి రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు.